PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 148 | విజయవాడ, గురువారం 29 డిసెంబర్ 2022 | 6+8 పేజీలు వెల : రూ.5.50

Vol No | Vijayawada, Thursday 29 December 2022 | Rs

సబ్సిడీ ఆహార ధాన్యాలు కొనసాగించాలి
- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్
- తీవ్రమవుతున్న మతోన్మాద ధోరణులపై ఆందోళన
- న్యాయ వ్యవస్థ స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి

లోపలి పేజీలో..



పాక్షికంగా గడ్డ కట్టిన నయాగరా!

లోపలి పేజీలో..

మళ్లీ వేడుకోలు

- విభజన సమస్యల పరిష్కారం
- పోలవరానికి నిధులు
- రుణ ఆంక్షలపై జోక్యం
- ప్రధానికి సిఎం విజ్ఞప్తి
- విశాఖ ఉక్కు విస్మరణ



ప్రధానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం జగన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రానికి సంబంధించి వివిధ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రధాని నివాసంలో బుధవారం ఆయనతో సిఎం సమావేశమైనారు. దాదాపు గంటపాటు ఈ భేటీ జరిగింది. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలతో పాటు, రాజకీయ చర్చ కూడా జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో విభజన సమస్యలు, పోలవరానికి నిధులు, రుణాలపై విధిస్తున్న ఆంక్షలను ప్రధానికి దృష్టికి సిఎం తీసుకువెళ్లారు. అయితే, గతంలో మాదిరే ఈ సమావేశంలోరూ విశాఖ ఉక్కు అంశాన్ని సిఎం ప్రస్తావించలేదు. అదే విధంగా వెనుకబడిన ప్రాంతాలకు, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ రైల్వే జోన్ అంశాలు కూడా ప్రస్తావనకు రాలేదని సమాచారం. ముఖ్యమంత్రి లేవనెత్తిన సమస్యలపై ప్రధాని స్పందించిన తీరు కూడా తెలియరాలేదు. రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లు గడిచినా అనేక అంశాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ముఖ్యమంత్రి మోడీ దృష్టికి తీసుకువెళ్లారు. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ పలుమార్లు సమావేశం అయినా ఎటువంటి పురోగతి లేదని ఆయన చెప్పినట్లు తెలిసింది. వివిధ పద్దుల కింద రాష్ట్రానికి కేంద్రం నుండి 32,625 కోట్ల రూపాయలు రావాల్సిఉందని, ఆ మొత్తాన్ని తక్షణం విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకునే రుణాలపై విధించిన ఆంక్షల కారణంగా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని, గత ప్రభుత్వం తీసుకున్న రుణాలకు కూడా తమపై ఆంక్షలు విధిస్తున్నారని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన 2,937 కోట్ల రూపాయలను ఇంకా చెల్లించలేదని, ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. అదే విధంగా పెరిగిన వ్యయంతో కలిపి రూ. 55,548 కోట్ల రూపాయలను పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయంగా పరిగణించాలని కోరారు. త్రాగునీరు సరఫరాను ప్రాజెక్టు నుంచి వేరుచేసి చూస్తున్నారని, దీన్ని ప్రాజెక్టులో భాగంగా చూడాలని కోరారు. పునరావాస పనులు పూర్తి చేసి, 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిలువచేసేందుకు తక్షణం .10,485.38 కోట్లు అవసరమవుతాయని, ఆ మొత్తాన్ని అడ్‌హాక్‌గా మంజూరు చేయాలని కోరారు. జాతీయ ఆహార భద్రతా చట్టంలో నిబంధనలు హేతుబద్ధంగా లేవని, దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతోందని ప్రధానికి చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రానికి 77 వేల టన్నుల బియ్యం కేటాయించాలని కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా విషయమై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. పార్లమెంటు వేదికగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి 12 మెడికల్ కళాశాలలను కేటాయించాలని, కడపలో నిర్మించనున్న సీల్‌ప్లాంటుకు సరిపడా ఖనిజాన్ని కేటాయించాలని, విశాఖలో 76.9 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ఏర్పాటుకు సహకారాన్ని అందించాలని కోరారు.

చంద్రబాబు సభలో విషాదం

- తొక్కిసలాటలో ఎనిమిది మంది మృతి
- పోటాపోటీగా జన సమీకరణ
- ప్రణాళిక లోపంతో ప్రమాదం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి, అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడి సభలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తొక్కిసలాట జరిగి కాలువలో పడిపోవడంతో ఎనిమిది మంది మృతి చెందారు. మృతులలో ఒక మహిళ కూడా ఉన్నారు. మరో ఐదుగరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. అనూహ్యంగా జరిగిన తోపులాటతో సంఘటన స్థలం ఆర్తనాదాలతో మారుమ్రోగింది. ఏం జరుగుతుందో అర్థం అయ్యేలోగానే పలువురు కాలువలోకి పడిపోయారు. బుధవారం సాయంత్రం నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన ఈ సంఘటన రాజకీయవర్గాల్లో కలకలం రేపింది. టిడిపి శ్రేణుల్లో విషాదాన్ని నింపింది. 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి ...' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు బుధవారం కందుకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక టిడిపి నాయకులు పోటాపోటీగా జన సమీకరణ చేశారు. సింగరాయకొండ నుండి ఇదే పరిస్థితి కనిపించింది. మధ్యాహ్నం మూడు గంటలకు సింగరాయకొండటో ప్రారంభమైన బాబు కాన్వాయ్ రాత్రి ఏడు గంటలకు కందుకూరు చేరుకుంది. అక్కడి నుండి బహిరంగసభ ప్రాంగణానికి చేరుకోవడానికి మరో గంట పట్టింది.


ఒక్క సారిగా తోపులాట...!

బహిరంగ సభ నిర్వహించిన ఎన్‌టిఆర్ సర్కిల్‌కు చంద్రబాబు కాన్వాయ్ చేరుకునే సమయానికే ఆ ప్రాంతం కిటకిటలాడుతోంది. కందకూరు పట్టణ టిడిపి నాయకులు ఇంటూరు నాగేశ్వరరావు, ఇంటూరి రాజేష్ నేతృత్వంలో పోటా పోటీగా జనసమీకరణ చేశారు. బాబు మాట్లాడటానికి సిద్ధం కాగానే ఒక్కసారిగా తోపులాట చోటుచేసుకుంది. వెనుకనున్న వారు ముందుకు తోసుకురావడానికి ప్రయత్నించారు. దీంతో గందరగోళం నెలకొంది. కొందరు





ఆసుపత్రికి బాధితుల తరలింపు



ఆసుపత్రిలో వైద్య సేవలు

గుండమకట్ట కాలువలోకి పడిపోయారు. డ్రైనేజి నీరు ప్రవహిస్తుండటంతో పడినవారందరూ నీట మునిగిపోయారు. అరుపులు, కేకలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. మరోవైపు కాలువలో పడినవారిని బయటకు తీయడం, ఆస్పత్రికి తరలించడమూ కష్టంగా మారింది. అంబులెన్స్‌ల్లోనూ, అందుబాటులో ఉన్న ఇతర వాహనాల్లోనూ వారిని కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తొలుత ఇద్దరే మరణించారని భావించినప్పటికీ , మృతుల సంఖ్య క్రమేణా పెరిగింది. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో చంద్రబాబు ప్రసంగాన్ని నిలిపివేసి, హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన బహిరంగ సభ వద్ద మాట్లాడుతూ.. ఈ సంఘటన బాధాకరమైందని, ఒక్కో కుటుంబానికి పార్టీ తరపున రూ.10లక్షలు అందిస్తామని ప్రకటించారు. వారి కుటుంబంలోని పిల్లలకు ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా విద్యనందిస్తామన్నారు. గాయపడిన వారికి పార్టీ తరపున ఆర్థికసాయం అందజేస్తామన్నారు. మృతి చెందిన వారికి పార్టీ నాయకులు దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహిస్తారని ప్రకటించారు. కార్యక్రమాన్ని సంతాప సభగా జరుపుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మాటలకు అందని విషాదం : అచ్చెన్నాయుడు

కందుకూరు చంద్రబాబు సభలో టిడిపి కార్యకర్తలు చనిపోవడం తీవ్రంగా కలచివేస్తోందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు తెలిపారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకూడదని ఆకాంక్షించారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి:సిపిఎం

తొక్కిసలాటలో ఎనిమిది మంది మృతిచెందడం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు సంతాపం, సానుభూతి ప్రకటించారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇలాంటి సమయాల్లో పోలీసులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని మిగతా 2లో

మృతుల వివరాలు..

- **చిన కొండయ్య** (గుడ్లూరు మండలం అమ్మవారిపాలెం)
- **కాకుమాని రాజా** (కందుకూరు పట్టణం గుర్రంవారిపాలెం)
- **దేవినేని రవింద్రబాబు** (ఉలవపాడు మండలం ఆత్మకూరు)
- **యాటగిరి విజయ** (ఉలవపాడు మండలం ఒరుగుసేనుపాలెం)
- **కలవకూరి యానాది** (కందుకూరు మండలం కొండముడుసు పాలెం)
- **యు. పురుషోత్తం** (గుడ్లూరు మండలం గుళ్ళపాలెం)
- **గడ్డం మధుబాబు** (కందుకూరు మండలం ఓగూరు)
- **రాజేశ్వరి** (కందుకూరు పట్టణం)

పోరాటాలు ఉధృతం

- మార్చిలో చలో విజయవాడ : గఫూర్
- ప్రారంభమైన కార్మిక చైతన్యయాత్రలు



హిందూపురంలో సిఐటియు జెండా ఊపి కార్మిక చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న గఫూర్

ప్రజాశక్తి- యంత్రాంగం

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగే సిఐటియు 16వ రాష్ట్ర మహాసభను పురస్కరించుకుని మూడు దిక్కుల నుంచి కార్మిక చైతన్య యాత్రలు బుధవారం ప్రారంభమయ్యాయి. సత్యసాయి, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల నుంచి ప్రారంభమైన జాతాలు జనవరి రెండోతేదీ నాటికి భీమవరానికి చేరుకుంటాయి. ఆయా జిల్లాల్లో చేపట్టిన జాతాలకు కార్మికులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ర్యాలీలో పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు రాబోయే రోజుల్లో కార్మిక పోరాటాలను మరింత ఉధృతం చేయనున్నట్టు పలువురు నాయకులు పేర్కొన్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణ పురవీధుల్లో అంబేద్కర్ సర్కిల్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద చైతన్య యాత్రను సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మార్చి నెలలో చలో విజయవాడ, ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం ఉంటుందన్నారు. హిందూపురం నుంచి ప్రారంభమైన యాత్ర పెనుకొండ, అనంతపురం, బుక్కరాయసముద్రం, తాడిపత్రి మీదుగా కడప జిల్లా ప్రొద్దుటూరుకు చేరుకుంది. సిఐటియు రాష్ట్ర నాయకులు స్వరూపరాణి, జి.ఓబులు, ఆర్‌వి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం జిల్లా మందసలో చేపట్టిన బస్సుయాత్రను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.గోవిందరావు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత వీరగున్నమ్మపురంలోని వీరనారి వీరగున్నమ్మ స్థూపానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావుతో పాటు సిఐటియు నాయకులు నివాళులర్పించారు. అనంతరం వీరగున్నమ్మ స్థూపం నుంచి మందస బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో మిగతా 2లో

భారత్ దగ్గు మందుతో 18 మంది మృతి

- ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడి

గాంబియా : భారత్‌కు చెందిన మరియన్ బయోటెక్ కంపెనీ తయారు చేసిన డాక్ -1 మ్యాక్స్ అనే దగ్గు మందు వికటించి ఉజ్బెకిస్తాన్‌లో 18 మంది చిన్నారులు చనిపోయారు. ఈ విషయాన్ని ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య శాఖ మంగళవారం తెలిపింది. మోతాదుకు మించి డాక్-1 మ్యాక్స్ సిరప్ వాడటంతోనే చిన్నారులు చనిపోయినట్లు పేర్కొన్నారు. ఇదివరకు హర్యానాకు చెందిన మైడెన్ ఫార్మా కంపెనీ తయారు చేసిన దగ్గు సిరప్ కారణంగా గాంబియాలో 63 మంది చిన్నారులు చనిపోయినట్లు కథనాలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై అక్కడి పార్లమెంటరీ ప్యానెల్ దర్యాప్తు చేయగా దగ్గు మందులో డై ఎథిలీన్ గ్లైకాల్, ఎథిలిన్ గ్లైకాల్ ఆమోదయోగ్యం కాని స్థాయిల్లో ఉన్నట్లు గుర్తించిన కొద్ది రోజులకే ఉజ్బెకిస్తాన్‌లో మరో ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. దీనిపై భారత ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు స్పందిస్తూ ఉజ్బెకిస్తాన్ ఘటనపై తమకు సమాచారం అందిందని, అయితే దీనిపై ఇప్పుడే స్పందించలేమని తెలిపారు.

రెండో విడత సచివాలయ ఉద్యోగులకు
మార్చిలో ప్రొబేషన్ డిక్లేర్

- సర్టిఫికెట్ల పరిశీలనకు ఆదేశాలు
- మూడేళ్లు పూర్తయిన వారికి మే చివరలో బదిలీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులుగా రెండో విడతలో ఎంపికైన ఉద్యోగుల ప్రొబేషన్ మార్చిలో డిక్లేర్ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. 2020 డిసెంబరు నెలలో సెకండ్ ఫేజ్‌లో ఎంపికైన ఉద్యోగులకు ఈనెల 20తో రెండేళ్లు పూర్తయింది. ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ కావాలంటే డిపార్టుమెంటల్ పరీక్షలు ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి. డిపార్టుమెంట్ టెస్ట్ రాసే ఉద్యోగులకు అకౌంట్ టెస్టులో భాగంగా ఈనెల 11న నిర్వహించిన పేపర్-1 (అకౌంట్ టెస్టు, పేపర్‌కోడ్ -146)లో వేరే పేపర్ కోడ్ ప్రశ్నలు వచ్చాయని, ఉద్యోగులకు న్యాయం చేయాలని పలు సంఘాలు ఎపిపిఎస్‌సి దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో ఆ ఒక్క పేపర్‌ను రద్దు చేస్తున్నట్లు, ఆ పరీక్షను తిరిగి ఈనెల 31న నిర్వహించనున్నట్లు ఎపిపిఎస్‌సి ఈనెల 14న ప్రకటించింది. ఈ నెలాఖరున జరిగే పరీక్షల ఫలితాలు వెలువడేంత వరకు ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ ముందుకు సాగే అవకాశాలు లేవు. ఫలితాలు వెలువడిన తరువాత మార్చి చివరిలో డిక్లేర్ ప్రక్రియ ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. డిపార్టుమెంటల్ పరీక్షలు ఉత్తీర్ణులైన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను ప్రారంభించేందుకు ఇప్పటికే ఉద్యోగుల వివరాలు పోలీస్ శాఖకు గ్రామ వార్డు సచివాలయశాఖ నుంచి వెళ్లాయి. ఈ ప్రక్రియ సంక్రాంతి అనంతరం ప్రారంభించే అవకాశమున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మేరకు సాధారణ పరిపాలనాశాఖ నుంచి డిజిపికి లేఖ కూడా వెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు 2023 మే చివరన లేక జూన్ మొదటి వారంలో ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ వర్గాల నుంచి సంకేతాలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు బదిలీలు కనీసం మూడు సంవత్సరాలు పూర్తయిన అనంతరమే జరగడం పరిపాటి. మొదటి విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రొబేషన్ డిక్లేర్ పూర్తి కావడంతో ఉద్యోగులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారు.

వికలాంగుల పింఛను పెంపు కోసం
మార్చి 15న చలో ఢిల్లీ

- ఎన్‌పిఆర్‌డి మహాసభ పిలుపు
- అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గిరీష్ కీర్తి, మురళీధరన్



గిరీష్ కీర్తి



మురళీధరన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) అఖిలభారత అధ్యక్షులుగా గిరీష్ కీర్తి, ప్రధాన కార్యదర్శిగా వి. మురళీధరన్ ఎన్నికయ్యారు. పోచంపల్లిలోని దేశ్‌ముఖ్‌లో జరుగుతున్న ఎన్‌పిఆర్‌డి 3వ జాతీయ మహాసభ చివరి రోజు బుధవారం 41 మందితో నూతన జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో రిలీవైన కాంతి గంగూలిని ప్యాట్రన్‌గా, నంబు రాజన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.అడివయ్య (తెలంగాణ), అనిర్బన్ ముఖర్జీ (బెంగాల్) ఝూన్సీ రాణి (తమిళనాడు)...సహాయ కార్యదర్శులుగా రిషికేష్ (హర్యానా), సామ్య గంగూలీ (బెంగాల్), కైరెల్లి ఎంపి (కేరళ), కోశాధికారిగా కెఆర్ చక్రవర్తి (తమిళనాడు) ఎన్నికయ్యారు. కేంద్ర కమిటీ సభ్యులుగా తెలంగాణ నుంచి కె వెంకట్, ఆర్ వెంకటేష్, సాయమ్మ, జెర్కొని రాజు.. ఆంధ్రప్రదేశ్ నుంచి అప్పలనాయుడు ఎన్నికయ్యారు. వికలాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 15న చలో ఢిల్లీకి ఎన్‌పిఆర్‌డి పిలుపునిచ్చింది. వికలాంగుల చట్టాలు పూర్తిస్థాయిలో అమలు, సంక్షేమ పథకాల కోసం దేశవ్యాప్త ఐక్య ఉద్యమాలు చేయాలని మహాసభ తీర్మానించింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల అమలు, వికలాంగులకు ఆహార భద్రత, పెన్షన్ పెంపు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, నూతన విద్యా విధానం రద్దు, వికలాంగులకు ఉపాధి హామీ జాబ్ కార్డులు మంజూరు, వికలాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో ఐదుశాతం నిధులు కేటాయించాలని మహాసభ తీర్మానించింది.

మహిళలపై ఆంక్షలొద్దు

- తాలిబన్లను కోరిన ఐరాస

బెర్లిన్ : ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళల హక్కులపై ఆంక్షలు పెరుగుతుండడం పట్ల ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే తాలిబన్ పాలకులు ఆ ఆంక్షలను ఎత్తివేయాలని కోరింది. ఆరవ గ్రేడ్‌కు మించి ఆడపిల్లలు చదువుకోవడానికి లేకుండా ఆంక్షలు విధించడాన్ని ఖండించింది. మహిళలకు పూర్తి స్థాయిలో సమానమైన, అర్థవంతమైన ప్రాతినిధ్యం వుండాలని పిలుపునిచ్చింది. ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల తరపున మహిళలు పనిచేయకుండా నిషేధించడం వల్ల తీవ్ర పర్యవసానాలు వుంటాయని ఐరాస మానవ హక్కుల కమిషనర్ వోకర్ తుర్క్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌జిఓ కార్యకలాపాల్లో మహిళలు పాల్గొనరాదంటూ గత శనివారం చేసిన ప్రకటన నేపథ్యంలో ఆఫ్ఘన్‌లో కార్యకలాపాలను నాలుగు ప్రధాన అంతర్జాతీయ సంస్థలు నిలుపుచేశాయి. జనాభాలో సగమైన మహిళలను మినహాయించడం వల్ల ఏ దేశమూ అభివృద్ధి చెందలేదని, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి పోతుందని, మనుగడే సాగించలేదని పేర్కొన్నారు. ఈ నిషేధాన్ని ఎత్తివేయకపోతే కీలక సేవలు అందడం ఆగిపోతుందని, వాటిపై అనేకమంది ఆఫ్ఘన్లు ఆధారపడి వున్నారని అన్నారు.

సిపిఎస్‌పై తగ్గేదేలే..

చట్టానికి రాష్ట్ర ప్రభుత్వ కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిస్టమ్)పై రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. తాజాగా రాష్ట్రంలో సిపిఎస్ అమలు కోసం ప్రత్యేకంగా చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం కసరత్తు చేసింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ఆర్థికశాఖ పరిశీలిస్తోంది, ఆర్థికశాఖ పరిశీలన తరువాత న్యాయశాఖకు

బిల్లు ముసాయిదా వెళ్లనుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లును ప్రతిపాదించే అవకాశం ఉంది. డ్రాఫ్ట్ సిపిఎస్ రూల్స్ - 2022 పేరిట ఈ కసరత్తు సాగుతోంది. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆందోళనను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న సంగతి స్పష్టమవుతోంది. రాష్ట్రంలో 2014 సెప్టెంబర్ ఒకటి నుంచే సిపిఎస్ అమలులోకి వచ్చింది. అప్పటి నుండి అమలు చేస్తున్నప్పటికీ ఇంతవరకు చట్టబద్ధత లేదు. కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్)లో భాగంగా రాష్ట్రాల స్థాయిలో సిపిఎస్‌ను రూపొందించిన విషయం తెలిసిందే. ఎన్‌పిఎస్ అమలులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న ఆదేశాలు, సర్క్యులర్ల ఆధారంగా రాష్ట్రంలో సిపిఎస్‌ను అమలు చేస్తున్నారు. అయితే, ఈ విధానం వల్ల భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు తలెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆ పరిస్థితిని అధిగమించేందుకు రాష్ట్ర స్థాయిలో చట్టం రూపొందించమే మార్గమని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దీని ద్వారా స్పష్టమైన నిబంధనలు రూపొందించాలన్నది ప్రభుత్వ ఆలోచన అని చెబుతున్నారు. గత ఎన్నికల ముందు సిపిఎస్ రద్దుకు ప్రతిపక్ష నేత హోదాలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత సిపిఎస్ రద్దు సాధ్యం కాదని చెబుతున్నారు.

టక్కర్ నివేదికలేమయ్యాయి...

సిపిఎస్ రద్దుకు సంబంధించి గత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి టక్కర్‌తో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించిన కమిటీ నివేదిక రూపొందించి, జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి న వెంటనే ఆయనకు సమర్పించింది. ఇందులో సిపిఎస్ రద్దుపై లాభనష్టాలను కూడా వివరించారు. అయితే ఈ నివేదిక ప్రస్తుతం బుట్టదాఖలైనట్టే కనిపిస్తోంది. సిపిఎస్, ఓపిఎస్ మధ్య అంతరాలను వివరిస్తూ టక్కర్ చేసిన సిఫార్సులు ప్రస్తుత అధికారులు పక్కన పెట్టేసి, కొత్త మార్గదర్శకాలు సిద్ధం చేశారు.

కర్ణాటకలో చర్చిపై దాడి

- దెబ్బతిన్న జీసస్ విగ్రహం

లోపలి పేజీలో..

జెఎన్‌టియుహెచ్‌లో ఎపి విద్యార్థిని ఆత్మహత్య



ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లోని జెఎన్‌టియు హెచ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థిని బుధవారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన మనోజ్ కుమార్‌రెడ్డి తన కుటుంబంతో కలిసి కొంతకాలంగా కూకట్‌పల్లిలో నివాసముంటున్నారు. అతని కుమార్తె మేఘనారెడ్డి జెఎన్‌టియుహెచ్‌లో బిటెక్ (కంప్యూటర్ సైన్స్ విభాగం) నాలుగో సంవత్సరం చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం 1:30 వరకు ఆమె తన తల్లితో కళాశాలలోనే ఉంది. అనంతరం 1:45కు కళాశాలలోని సిఎస్‌ఆర్ బిల్డింగ్‌పై నుంచి దూకి మేఘన ఆత్మహత్య చేసుకుంది. ఆమె కొంతకాలంగా డిప్రెషన్‌లో ఉందని, అందుకు మందులు కూడా వాడుతోందని తెలిసింది. సిఐ కిషన్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. చదువులో మేఘనా చురుకుగా ఉండేదని, ఎంసెట్‌లో ఆమెకు 200వ ర్యాంకు వచ్చిందని జెఎన్‌టియుహెచ్ ప్రిన్సిపల్ జయలక్ష్మి తెలిపారు.

యథావిధిగా బదిలీలు

- ఫ్యాప్టో డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిఒ 187, 190లలో ఉన్న అసంబద్ధాలను సవరణ చేసి ఉపాధ్యాయ బదిలీలు యథావిధిగా నిర్వహించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఎపిటిఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం చైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఉపాధ్యాయ బదిలీలు షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలంటూ అసంబద్ధంగా ఉన్న అంశాలపై వేలాదిమంది ఉపాధ్యాయులు ఇప్పటికే కోర్టును ఆశ్రయించారని పేర్కొంది. ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్‌చేసే విధానాన్ని అంగీకరించబోమని, ఒకవేళ ప్రభుత్వమే సిఫార్సు బదిలీలు చేయడానికి పూనుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించింది. సమావేశానికి ముందు సెక్రటరీ జనరల్ చెన్నుపాటి మంజుల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో కో చైర్మన్లు కె నరహరి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎల్ సాయి శ్రీనివాస్, ఎస్ చిరంజీవి, కోశాధికారి సిహెచ్ సుబ్బారావు, కార్యదర్శి ఎంఎస్ ఇమామ్ బాషా, కార్యవర్గ సభ్యులు కె భానుమూర్తి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

- సిపిడిసిఎల్ వార్షికోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సిఎం జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను పరిశీలించి ప్రభుత్వం తప్పకుండా పరిష్కరిస్తుందని, తమది ఉద్యోగులకు మేలు చేసే ప్రభుత్వమని తెలిపారు. సిపిడిసిఎల్ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యుత్ అనుబంధ సంస్థల డైరీ, క్యాలెండను విజయవాడలో బుధవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, రాష్ట్ర పురోభివృద్ధి విద్యుత్ రంగ ప్రగతిపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పనకు రూ.3,500 కోట్ల రుణం తెచ్చి పనులు చేస్తున్నామని తెలిపారు. పోల్ టు పోల్ సర్వే పక్కాగా నిర్వహిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ మాట్లాడుతూ ట్రాన్స్‌మిషన్ రంగంలో దేశంలోనే రాష్ట్రం ముందుందని చెప్పారు. నాణ్యమైన విద్యుత్‌ను సరసమైన ధరకు అందించేలా విద్యుత్ ప్రగతిపథంలో దూసుకెళ్లాలన్నదే సిఎం లక్ష్యమని ట్రాన్స్‌కో సిఎమ్‌డి బి.శ్రీధర్ అన్నారు. సిపిడిసిఎల్ సిఎండి పద్మజనార్ధన్ రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో జెఎండి మల్లారెడ్డి, నెడ్‌క్యాప్ ఎమ్‌డి రమణా రెడ్డి, ఎపిఎస్ఇసిఎం సిఇవో ఎ.చంద్రశేఖర్ రెడ్డి, ఇపిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలివ్వాలని రైల్వే కాంట్రాక్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే స్టేషన్‌లో రక్షక్ సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టు కింద పనిచేస్తున్న 400మంది రైల్వే కాంట్రాక్టు కార్మికులకు బకాయి పడిన జీతాలు వెంటనే చెల్లించాలని, అక్రమంగా తొలగించిన కాంట్రాక్టు కార్మికురాలు వై.ఆదిలక్ష్మి, మరో ఇద్దరిని వెంటనే డ్యూటీలోకి తీసుకోవాలని ఎపి రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వివిఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. రెండు రోజులుగా చేస్తున్న పోరాట కార్యక్రమంలో భాగంగా బుధవారం రైల్వే స్టేషన్ మస్టర్ పాయింట్ వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిఎల్ నరసింహులు మాట్లాడుతూ రక్షక్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీ కార్మికులకు జీతాలు ఎప్పుడూ సకాలంలో చెల్లించలేదని అన్నారు. నవంబరు నెల జీతాలు డిసెంబరు నెల చివరికి వచ్చినా ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నించిందనే కారణంతో వై.ఆదిలక్ష్మితో పాటు మరో ఇద్దరు కార్మికులను కాంట్రాక్టరు తొలగించారని, తక్షణమే వారిని డ్యూటీలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, ఎవి రావు, ఐవి నారాయణ, వై.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ ఎజెండాగా పోరాటాలు

- రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- ఉప ప్రణాళిక కొనసాగించాలని వక్తల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ అనేదే ఎజెండాగా రాష్ట్ర ప్రజల ముందు పెట్టేందుకు పోరాడాలని, దీనికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాను కొనసాగించాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రస్థాయిలో ఉన్న సబ్‌ప్లానును క్రమంగా నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. నీతి ఆయోగ్ పెట్టి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, పేదల గురించి పట్టించుకోవడం లేదని తెలిపారు. 1980 నుండి బడ్జెట్లో భాగంగా కొనసాగుతూ వస్తున్న సబ్‌ప్లాను నిధుల కేటాయింపును తగ్గించుకుంటూ వస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ సబ్‌ప్లాను చట్టం చేయాలని సిపిఎం, ఇతర దళిత సంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో 2014లో దీనిపై చట్టం చేయడంతో కొంత గ్యారంటీ వచ్చిందని, అయినా 2018 నుండి నిధుల కేటాయింపునూ 90 శాతం నుండి 50 శాతానికి తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. సబ్‌ప్లానులో వెనుకబడిన ప్రాంతాలను, ఆయా తరగతుల ప్రజలను, ఎస్‌సి, ఎస్‌టిలను ఎలా అభివృద్ధి చేయాలి, ప్రభుత్వ పెట్టుబడి ఎలా ఖర్చు చేయాలనేది ఆలోచన చేస్తారని, నీతి ఆయోగ్‌లో అటువంటి ప్రస్తావన లేదని వివరించారు. ముఖ్యంగా ప్రభుత్వ రంగాన్ని క్రమంగా తగ్గించుకుంటూ వస్తుండటంతో సామాజిక న్యాయం నడుములు విరిగినట్లయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో నవరత్నాలు, అమ్మ ఒడి, చేయూత వంటి పథకాలకు సబ్‌ప్లాను నిధులు మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. సబ్‌ప్లాన్ కొనసాగించుకునేందుకు వీలుగా కెవిపిఎస్, ఇతర అన్ని దళిత సంఘాలు పోరాడాలని, దీన్నే ఎజెండాగా మార్చాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ సబ్‌ప్లాను కోసం కెవిపిఎస్ పోరాడిందని, ఈ పోరాటంతోనే ప్రభుత్వం దిగొచ్చి కమిషన్ వేసిందని పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ దళితుల కోసం ఎన్ని చట్టాలు చేస్తున్నా అవి పేపర్లకే పరిమితం అవుతున్నాయని, అమలులో తీవ్ర జాప్యం కనిపిస్తోందని తెలిపారు. బడ్జెట్లో నిధులు కేటాయించినా అమల్లో పూర్తి వెనుకబాటు ఉందని పేర్కొన్నారు. జైభీం భారత్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండలరావు మాట్లాడుతూ ఇప్పటికీ అనేక దళితవాడలు అట్టడుగునే ఉన్నాయని తెలిపారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు మాట్లాడుతూ సబ్‌ప్లానుకు నిధులు కేటాయింపు తప్ప వినియోగం లేదని అన్నారు. అది దళితుల హక్కని, దాన్ని కాలరాసేందుకు ఎవరికీ అధికారం లేదని పేర్కొన్నారు. చట్టం చేసిన సమయంలో పదేళ్ల కాలపరిమితి విధించారని, అయితే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మేధావుల ఫోరం అధ్యక్షులు నేతి మహేష్ మాట్లాడుతూ దీనిపై పోరాడకపోతే దళితులు భవిష్యత్‌లో అభివృద్ధి చెందడం కష్టమని పేర్కొన్నారు. లోక్‌జనశక్తి పార్టీ నాయకులు చింతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సబ్‌ప్లాను కోసం భవిష్యత్‌లో జరిగే పోరాటాలకు తనవంతు మద్దతు ప్రకటించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఎన్ని చట్టాలు ఉన్నా అడుగడుగునా వివక్ష కొనసాగుతోందని, వివక్షను అడ్డుకోకపోతే అభివృద్ధి ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కన్వీనర్ శివనాగరాణి, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు నాగేంద్ర, అరుంధతీయ సంక్షేమసంఘం నాయకులు జాన్‌మేస్త్రీ, బిఎస్‌పి నాయకులు కాంతారావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి, ఎంసిపిఐ నాయకులు ప్రభాకర్, డప్పుకారుల సంఘం నాయకులు క్రాంతి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, డిహెచ్‌పిఎస్ నాయకులు పేరయ్య పాల్గొన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నటరాజు తొలుత వక్తలను వేదిక మీదకు ఆహ్వానించారు.

సిఎంకు అర్జీ

ముఖ్యమంత్రిని కలిసి సంతకాలతో కూడిన అర్జీ ఇవ్వాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. అలాగే జిల్లాస్థాయిలో రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు, నిర్వహించాలని, అన్ని పార్టీల అధ్యక్షులకు అర్జీలు ఇవ్వాలని నిర్ణయించారు. చట్టం కొనసాగించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని వక్తలు ఏకగ్రీవంగా తీర్మానించారు.

ఐఎంఎ రాష్ట్ర శాఖకు 11 జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ), ప్రజారోగ్య పరిరక్షణకు, వైద్యుల సంఘానికి అందించిన సేవలకు జాతీయ స్థాయిలో 11 అవార్డులను అందుకుంది. ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లో ఈ నెల 26, 28 తేదీల్లో జరిగిన ఐఎంఎ జాతీయ సదస్సులో డాక్టర్ సహజానంద ప్రసాద్ సింగ్ చేతుల మీదుగా రాష్ట్రానికి చెందిన డాక్టర్లు అవార్డులను అందుకున్నారు. ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులుగా బహుముఖ సేవలందించినందుకు డాక్టర్ సి. శ్రీనివాసరాజు (ఏలూరు)కు, డాక్టర్ ఎకెఎన్ సిన్హాకు జాతీయ అవార్డు, ఐఎంఎ వైద్య విద్యావిభాగం కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించినందుకు డాక్టర్ డి.శ్రీహరిరావు (తిరుపతి) సిపిఆర్ ప్రథమ చికిత్సలో దేశ వ్యాప్తంగా ప్రజలకు వైద్యులకు శాస్త్రీయ అవగాహనా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించినందుకు డాక్టర్ ఎస్‌సి చక్రరావు (కాకినాడ), డాక్టర్ ఎకె ఎన్ఎస్ జాతీయ అవార్డులు లభించాయి.

ఐఎంఎ జాతీయ అధ్యక్షుని ఉత్తమ రాష్ట్ర కార్యదర్శి అవార్డును డాక్టర్ గార్లపాటి నందకిషోర్, (గుంటూరు), డాక్టర్ ఎం.సుభాష్ చంద్రబోస్ (విజయవాడ) కార్డియాలజిస్టుగా ఉత్తమ సేవలందించినందుకు రమేష్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ పిఎస్ఎస్ హరిత (గుంటూరు), ఐఎంఎ గుంటూరు శాఖ కార్యదర్శిగా ఐఎంఎ జాతీయ స్థాయిలో ప్రజలకు, వైద్యులకు అందిస్తున్న సేవల డైరెక్టరీని ప్రచురించినందుకు డాక్టర్ టి.సేవకుమార్(గుంటూరు) కు, అనంతపురం ఐఎంఎ శాఖ అధ్యక్షులుగా ఉత్తమ సేవలందించినందుకు డాక్టర్ జి.హేమలత (అనంతపురం), డాక్టర్ రాయపు రమేష్ (తిరుపతి) డాక్టర్ రోహిణి(గూడూరు) డాక్టర్ పి.అనిల్‌కుమార్ (నంద్యాల)కు అవార్డులు లభించాయి.


కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో తెలంగాణ ప్రభుత్వ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం బేగంపేట హరిత ప్లాజా హోటల్‌కు చేరుకున్న కేరళ సిఎంకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య, జూలకంటి రంగారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఖమ్మంలో గురువారం సాయంత్రం జరిగే వ్యవసాయ కార్మిక సంఘం బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించనున్నారు.

పలుచోట్ల ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె గంగాధరరావు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్‌టిసి రీజనల్ కార్యాలయాల ముందు యూనియన్ ఆధ్వర్యాన రిటైర్డ్ ఉద్యోగులు బుధవారం నిరసన కార్యక్రమాలను నిర్వహించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు చట్టప్రకారం గ్రాట్యుటి చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ సమస్యలను పరిష్కరించాలని, ఆర్‌టిసి ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. 2020, 2021లలో రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చినట్లు ఆర్‌టిసి ఉద్యోగులకు మట్టి ఖర్చులకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

మెరుగైన పోలీసింగ్‌తో తగ్గిన నేరాలు

- డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి


క్రైమ్ నివేదికను విడుదల చేస్తున్న డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పోలీస్‌శాఖ తీసుకున్న ప్రత్యేక చర్యలతో నేరాలను బాగా తగ్గించగలిగామని డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మంగళగిరిలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో 2022 సంవత్సరానికి సంబంధించిన క్రైమ్ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతేడాది రాష్ట్రంలో 2,84,753 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 2,31,359 కేసులు నమోదయ్యాయని అన్నారు. 2021లో 945 హత్య కేసులు నమోదు కాగా, 2022లో 857 హత్య కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2021లో 19,203 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 2022లో 18,739 ప్రమాదాలు జరిగాయని చెప్పారు. గత ఏడాది 21 మందికి మాత్రమే కోర్టువిచారణ పూర్తయి శిక్షలు పడగా, ఈ ఏడాది 90 మందికి శిక్షలు పడ్డాయన్నారు. జీవితఖైదు 42 మందికి పడిందన్నారు. లోక్ అదాలత్ ద్వారా పెద్దఎత్తున కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని, మొత్తం 1.08 లక్షల కేసులను పరిష్కరించామని తెలిపారు. దొంగతనం కేసుల్లో రికవరీ శాతం బాగా పెరిగిందని చెప్పారు. దిశ యాప్ డౌన్‌లోడ్ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం వల్ల 1,37,54,267 మంది అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకోగా, 1,11,08,227 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. యాప్‌ను ప్రారంభించిన మొదటి రెండు సంవత్సరాల్లో, 27,09,174 లక్షల మంది రిజిస్ట్రేషన్లు చేసుకోగా, 2022లో మొత్తంగా 85 లక్షల మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని చెప్పారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణను సమర్థవంతంగా నిర్వహించేందుకు కొత్తగా 14 సబ్ డివిజన్లు, 19 సర్కిల్‌లు, రెండు పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయడంతోపాటు 21 పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్ చేశామని తెలిపారు. అక్రమ మద్యం రవాణా, నాటుసారా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయని తెలిపారు.

మహిళలపై పెరిగిన హింస

మహిళల భద్రత కోసం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నా వారిపై ఆందోళనకరంగా హింస పెరుగుతోంది. రోడ్డు ప్రమాదాలు తగ్గినా దొంగతనాలు, సైబర్ నేరాలు గణనీయంగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. మహిళలపై హింస, దొంగతనాలు, సైబర్‌నేరాలు ఏ మాత్రం అదుపులోకి రాని పరిస్థితి నెలకొంది. గతంతో పోలిస్తే మహిళలపై కుటుంబ హింసకు సంబంధించిన కేసులు భారీగా పెరగడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. కుటుంబహింస కేసులు 2020లో 7,039 నమోదు కాగా, 2021లో 10,373, 2022లో 11,895 కేసులు నమోదయ్యాయి. 2020లో రేప్‌కేసులు 1,255 నమోదు కాగా, 2021లో 1,456, 2022లో 1,419 కేసులు నమోదయ్యాయి. మద్యం అక్రమ రవాణా, గంజాయి కేసులు భారీగా పెరిగాయి. 2020లో 2,122 సైబర్ కేసులు నమోదుకాగా, 2,021లో 2039 నమోదయ్యాయి. 2022కు వచ్చేసరికి 2,783 కేసులు నమోదయ్యాయి. లోన్‌యాప్‌ల వేధింపులు తాళలేక బాధితులు ఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఏడాది అక్రమ మద్యం, నాటుసారాకు సంబందించి 169మందిపై పిడి యాక్ట్ పెట్టారు. గంజాయికి సంబంధించి 7,120 ఎకరాల్లో 3,52,88,750 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. 2.45 లక్షల కిలోల గంజాయిని సీజ్ చేసి ధ్వంసం చేశారు.


తిరుపతిలో టిటిడి ఫారెస్టు కార్మికుల దీక్షా శిబిరం వద్ద ప్రసంగిస్తున్న అజయ్‌కుమార్



శ్రీకాకుళంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పోరాటాలు ఉధృతం

మొదటి పేజీ తరువాయి

సిహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ.. దేశ సంపదను విదేశీ కంపెనీలకు కేంద్రం కట్టబెడుతోందన్నారు. మూడు లక్షల కోట్ల విలువ గల విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియా కంపెనీకి కారుచౌకగా అమ్మేస్తోందని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించిన ప్రభుత్వాలే, దాన్ని అమలు చేయకుండా మోసం చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కులకు వాటిల్లుతున్న నష్టంపై చైతన్యం తీసుకొచ్చేందుకే బస్సు యాత్రను ప్రారంభించామని చెప్పారు. మందస నుంచి కాశీబుగ్గ, కోటబొమ్మాళి, శ్రీకాకుళం ఏడురోడ్ల కూడలి వరకూ యాత్ర కొనసాగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రారంభమైన జాతాను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్, రాష్ట్ర నాయకులు దయా రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. కనీస వేతన సాధనే ప్రధాన అజెండాగా కార్మిక చైతన్య యాత్ర సాగుతోందని నాయకులు తెలిపారు. రూ.1250 కోట్లను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుంచి రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా లాక్కు ందని, కార్మికుల శ్రేయస్సు కోసం దీన్ని ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

రెండేళ్లుగా రిలేదీక్షలు చేస్తున్న అటవీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యను ప్రత్యేక అజెండాగా చర్చిస్తామన్నారు. టిటిడి ఫారెస్టు కార్మికుల దీక్షా శిబిరం వద్ద కార్మికులు పెద్దఎత్తున ఈ యాత్రకు స్వాగతం పలికారు. కుప్పంలో ప్రారంభమైన యాత్ర వి.కోట, పలమనేరు, చిత్తూరు మీదుగా సాయంత్రానికి తిరుపతి చేరుకుంది. సిఐటియు తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిబిఎస్ మణ్యం, కందారపు మురళి, సురేంద్రన్, చైతన్య పాల్గొన్నారు.

మైనింగ్ కోసం దళితుల భూములను కాంట్రాక్టర్లకు కట్టబెట్టడం ఆపాలి

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూములను ఏ పేరుతో అన్యాక్రాంతమైనా వాటిని తిరిగి పేదలకే అప్పగించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో అనేకచోట్ల పేదలకిచ్చిన అసైన్డ్ భూములను కాజేసేందుకు గద్దల్లా వాలుతున్న మాఫియాకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కొమ్ము కాయడాన్ని తీవ్రంగా ఖండించింది. అసైన్డ్ భూముల సవరణ చట్టం తేవాలన్న ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ మేరకు బుధవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రకటన విడుదల చేశారు. చిలకలూరిపేట మండలంలో కొన్ని గ్రామాల్లో ప్రభుత్వం దళితులకు అసైన్డ్ భూములు ఇచ్చిందని, ఆ భూములను దళితులు సాగు చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. అక్కడ మైనింగ్ ఉందని చెప్పి నేడు సాగుదారులను భూముల్లోకి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు పోలీసులు అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. దళితుల పోరాటం సరైనదేనని హైకోర్టు జోక్యంతో రుజువైందని వివరించారు. ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా భూములు తిరిగి స్వాధీనం చేసుకోవడం సరికాదన్న కోర్టు సూచనను హర్షిస్తున్నామని పేర్కొన్నారు. ఎడవల్లి గ్రామంలో దాదాపు 50 సంవత్సరాల క్రితం 416 ఎకరాలు దళితులకు ఇచ్చారని ఆ భూముల్లో మైనింగ్ ఉందని చెప్పి దళితులను ఆ భూముల్లో సాగు చేయడానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డగించడానికి వ్యతిరేకించారు. బాధితులకు అండగా సిపిఎం పోరాడుతోందని పేర్కొన్నారు. మురికిపూడిలో దళితులకు 90 ఎకరాలు అసైన్డ్ భూములు 2007లో ఇచ్చారని ఆ భూముల్లో మైనింగ్ ఉందని చెప్పి దళితులను సాగుకు అనుమతించకుండా రెవెన్యూ అధికారులు పోలీసులు అడ్డగించారని తెలిపారు. దళితులు హైకోర్టును ఆశ్రయించగా దళితులకు ఇచ్చిన ఎస్సైన్డ్ భూములు సేకరించడానికి ప్రభుత్వం కలెక్టర్ ఎటువంటి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదని, మైనింగ్ కోసం సేకరించాలంటే ముందుగా వారికి నోటీసు ఇవ్వాలని, నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హైకోర్టు ఇచ్చిన ఆదేశాన్ని సిపిఎం హర్షిస్తోందని పేర్కొన్నారు. అధికార పార్టీ నాయకులు స్థానిక మంత్రి మద్దతుతో మైనింగ్ పేరుతో అక్రమంగా దళితుల భూములు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మైనింగ్ లీజు కేటాయింపులను వ్యతిరేకిస్తే బీఫామ్ పట్టాలు రద్దు చేస్తామని బెదిరించడం దుర్మార్గమైన చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు తీర్పు తర్వాతనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ దురాక్రమణలు ఆపాలని కోరారు. మైనింగ్ కోసం భూములను ఇవ్వాలని, రెవెన్యూ, పోలీస్ అధికారులు అసైన్డ్ భూముల లబ్ధిదారులను ఇబ్బందులు పెట్టడం అక్రమ అరెస్టులు చేయడం వంటి దురాగతాలకు వెంటనే స్వస్తి చెప్పాలని హెచ్చరించారు. రాష్ట్రంలో 9/77 చట్టం అమల్లో ఉన్నప్పటికీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆ చట్టాన్ని ఖాతరు చేయకుండా దళితులకు ఇచ్చిన ఎస్సైన్డ్ భూములను బలవంతంగా గుంజుకుంటోందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా భూపంపిణీ కార్యక్రమం చేపట్టాలని, పేదల సాగులో ఉన్న భూములకు పట్టాల మంజూరు చేయాలని, మైనింగ్ పేరుతో అభివద్ధి పేరుతో దళితుల భూములు లాగేయడం సరికాదని ఒకవేళ అనివార్యమైతే 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూములు సేకరించాలని లేదా పేదల సహకార సంఘాలకే మైనింగు లీజుకివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం

- గృహనిర్మాణ సంస చైర్మన్ దొరబాబు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో "నవరత్నాలు -పేదలందరికీ ఇళ్లు" పథకం కింద నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ దావులూరి దొరబాబు అధికారులను ఆదేశించారు. విజయవాడ ఆటోనగర్‌లోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన అధ్యక్షతన 30వ బోర్డు సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంత వరకు 2.10 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 12లక్షల ఇంటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను సకాలంలో పూర్తి చేయాలన్నారు. రూ.34 వేలకోట్ల వ్యయంతో ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టామని, మొదటి దశ ఇంటి నిర్మాణాలన్నింటినీ 2023 డిసెంబరు నెలాఖరు కల్లా పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకుల వద్ద నుంచి అదనంగా రూ.35 వేలు రుణం అందిస్తున్న విషయాన్ని లబ్ధిదారులకు అధికారులు, బోర్డు డైరెక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎమ్‌డి లక్ష్మీషా మాట్లాడుతూ ఇళ్ల పథకంలో ఇంతవరకు ప్రభుత్వం రూ.8 కోట్లు వ్యయం చేసిందని, సకాలంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్దిదారుల ఇంటి వద్దకే గృహ నిర్మాణ సామాగ్రిని సరఫరా చేయడానికి పెద్ద లే అవుట్లలో గొడౌన్లు నిర్మిస్తున్నామని, ప్రస్తుతం 72 గొడౌన్లు నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. జగనన్న లే అవుట్లలో మంచినీటి సరఫరా, విద్యుత్తు, డ్రైనేజీ, రహదారులు నిర్మాణానికి రూ.33 వేలకోట్లు ప్రభుత్వం వ్యయం చేస్తోందన్నారు.

17,53,196 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 3,10,791 మంది రైతుల వద్ద నుంచి రూ.3,578.43 కోట్ల విలువైన 17,53,196 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండియన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూ.1773.98 కోట్లను 1,67,085 మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులు తమ సొంత ఖర్చులతో గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాటు చేస్తే మద్దతు ధరతోపాటు 21రోజులలోపు ఖర్చులు చెల్లిస్తున్నట్లు వీరపాండియన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు గోనె సంచుల ఛార్జీలు, హమాలీ ఛార్జీలు, రవాణా చార్జీలు తాలూకా రూ.17.66 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. గత మూడేళ్లలో ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ 2019-20లో 13,40,554 మెట్రిక్ టన్నులు, 20-21లో 13,61,447, 21-22లో 9,65,437, 22-23లో 17,53,196 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు పేర్కొన్నారు.


బాధితులను పరామర్శించేందుకు ఆసుపత్రికి వచ్చిన చంద్రబాబు

చంద్రబాబు సభలో విషాదం

మొదటి పేజీ తరువాయి

సూచించారు.

బాధాకరం: సిపిఐ

కందుకూరు ఘటనలో అమాయకులు మృతిచెందడం బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. రాజకీయ పార్టీలు ఇలాంటి బహిరంగ సభలు జరిగే సమయంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన లోకేష్

ప్రమాద ఘటనపై టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ కుటుంబ సభ్యులైన కార్యకర్తల మృతి పార్టీకి తీరని లోటు అని తెలిపారు. మృతుల కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ప్రకటించారు.

బాధాకరం: కాంగ్రెస్

కందుకూరులో తొక్కిసలాట జరిగి మరణాలు సంభవించడం బాధాకరమని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వారి కుటుంబాలకు సానుభూతి, సంతాపం ప్రకటించారు.

చంద్రబాబు కారుని ఢీకొన్న బైక్

ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఓ యువకుడు బైకుపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయాణిస్తున్న కారును డ్రైవర్ వైపు నుంచి ఢీ కొట్టాడు. ఎస్‌పిజి కమాండర్స్ వెంటనే వాహనాలు దిగి.. పరిస్థితిని చక్కదిద్దారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - నూజివీడు (ఏలూరు జిల్లా)


తవిటయ్య (ఫైల్ ఫొటో)

అప్పులబాధతో కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏలూరు జిల్లా నూజివీడు మండలం జంగంగూడెంలో బుధవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగంగూడానికి చెందిన మింది తవిటయ్య (53) రెండు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని నాలుగేళ్లుగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఏయేటికాయేడు సాగులో నష్టాలు రావడంతో రూ.5 లక్షలకుపైగా అప్పులపాలయ్యారు. రుణ దాతల ఒత్తిడి అధికమవ్వడంతో తీవ్ర మానసికవేదనకు గురయ్యారు. అప్పు తీర్చే మార్గంలేక మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడు తవిటయ్యకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. తవిటయ్య భౌతికకాయాన్ని ప్రజాసంఘాల నేతలు, పలువురు సామాజికవేత్తలు సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు హైవేపై విమానాల ల్యాండింగ్ ట్రయల్ రన్


- పిచ్చికలగుడిపాడు జాతీయ రహదారిపై ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ఎయిర్ స్ట్రిప్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జాతీయ రహదారిపై నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ ఫెసిలిటీ ప్రాంతం (ఎయిర్ స్ట్రిప్) దక్షిణ భారతదేశంలో తొలిసారిగా అందుబాటులోకి రానుంది. విపత్తు సమయాలు, అత్యవసర పరిస్థితుల్లో విమానాలు అత్యవసరంగా కిందకు దిగడానికి వీలుగా రన్‌వేలను ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి-16పై బాపట్ల జిల్లా కొరిశపాడు, రేణంగివరం గ్రామాల వద్ద నిర్మించిన ఎమర్జెన్సీ ల్యాండింగ్ రన్‌వేపై గురువారం ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. రూ.79 కోట్ల వ్యయంతో ఐదు కిలోమీటర్ల మేర ఈ రన్‌వేను నిర్మించారు. ట్రయల్ రన్ నిర్వహించే విమానాలు 100 మీటర్ల ఎత్తులో ప్రయాణించనున్నాయి. ప్రస్తుతం ఈ రన్‌వేపై విమానాలు దిగవని, మార్చి లేదా ఏప్రిల్‌లో విమానాలు కిందకు దిగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల్లో భాగంగా ఈ నెల 29వ తేదీన ట్రైల్ రన్ నిర్వహిస్తున్నట్లు భారత వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ ఆర్ఎస్.చౌదరి తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం
అఖిల భారత మహాసభ లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) 10వ అఖిల భారత మహాసభ పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 18వరకు నిర్వహించనున్నారు. మహాసభ లోగోను ఎఐఎడబ్ల్యుయు కేంద్ర కార్యాలయం (క్యానింగ్ లైన్ 36)లో బుధవారం జరిగిన విలేకరులు సమావేశంలో ఎఐఎడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ విజయరాఘవన్, బి వెంకట్, ఉపాధ్యక్షుడు ఎంవి గోవిందన్ మాస్టార్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయరాఘవన్, వెంకట్ మాట్లాడుతూ మహాసభకు 20 రాష్ట్రాల నుంచి దాదాపు 650 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. దేశంలోని గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. పాలకులు ఆయా వర్గాలను పట్టించుకోవటం లేదన్నారు. నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదక ప్రకారం దేశంలో గతేడాది 5,563 మంది వ్యవసాయ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం, సాయం అందలేదని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల్లో 50 దళితులే ఉన్నారని, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుండటంతో దళితులుకు, గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు.

ఏపి ప్రయోజనాలు బిజెపికి తాకట్టు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలోని బిజెపికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాకట్టు పెట్టారని బి వెంకట్ విమర్శించారు. వ్యవసాయ కార్మికుల సమస్యలను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్మోహన్ రెడ్డి, కె చంద్రశేఖర్ రావు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



నేడు విఒఎల రాష్ట్ర మహాసభ

- ముస్తాబైన అనకాపల్లి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర నాలుగో మహాసభకు అనకాపల్లి ముస్తాబైంది. గవరపాలెంలోని వివి.రమణ రైతు భారతి కల్యాణ వేదికలో గురు, శుక్రవారాల్లో జరగనున్న మహాసభకు రాష్ట్ర నలుమూలల నుంచి 350 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నారు. మహాసభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్.నర్సింగరావు, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, విఒఎల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి ప్రసంగించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28,500 మంది విఒఎలు పని చేస్తున్నారు. వీరిని తొలగించేందుకు, వేతనాలు తగ్గించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఐక్య పోరాటాలతో విఒఎలు ఎదుర్కొన్నారు. విఒఎలకు పది వేల రూపాయల వేతనం పెంచుతామని పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అమలుకాకపోవడంతో చలో విజయవాడ నిర్వహించి వేతనం పెంచుకోగలిగారు. మూడేళ్లు పూర్తి చేసిన విఒఎలను తొలగించాలని ప్రభుత్వం జారీ చేసిన 64/11 సర్క్యులర్‌ను రద్దు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద నిరసన తెలిపారు. దీంతో ప్రభుత్వం దిగొచ్చి సర్క్యులర్‌ను అమలు చేయకుండా మూడేళ్ల కాలవ్యవధి పెంచింది. విఒఎలు అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించారు. ఈ పోరాట విజయాలు, వైఫల్యాలపై మహాసభలో సమీక్షించి, కర్తవ్యాలను రూపొందించనుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రూపాదేవి తెలిపారు.



ఛాందస భావజాలంతో మహిళల అణచివేత

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-నెల్లూరు

ఛాందస భావజాలాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ భావాలే మహిళల అణిచివేతకు కారణమవుతున్నాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. కేరళ రాష్ట్రం త్రివేంద్రంలో జనవరి ఆరు నుంచి తొమ్మిది వరకు జరగనున్న 13వ ఐద్వా అఖిల భారత మహాసభను పురస్కరించుకుని నెల్లూరులోని రామచంద్రారెడ్డి భవన్ ఆవరణలో జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ అన్ని ప్రాంతాల్లో స్థానిక శాఖల ఆధ్వర్యంలో 13 ఐద్వా జెండాలను ఆవిష్కరించాలని మహిళా సంఘం పిలుపు నిచ్చిందన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజికంగా మహిళలు అసమానతలకు గురవుతున్నారని చెప్పారు. సాంప్రదాయ భావజాలాన్ని కేంద్ర ప్రభుత్వం విస్తరింపజేస్తున్నందు వల్ల ఈ సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. పర్యావరణ అంశాలను సైతం ఈ మహాసభలో చర్చకు రానున్నాయన్నారు. రాబోయే కాలంలో కలిసి వచ్చే వ్యక్తులను, ఏవరైతే మహిళల అభివృద్ధి కోసం పనిచేస్తారో అటువంటి పురుషులను కలుపుకొని ఉద్యమాలను ఉధృతం చేసేందుకు ఈ మహాసభల్లో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శివకుమారి, ఎస్‌కె మస్తాన్‌బి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

27నుండి లోకేష్ 'యువగళం'

కుప్పం నుండి ప్రారంభం కానున్న పాదయాత్ర
400 రోజులు 4వేల కిలోమీటర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తం పాదయాత్రను నిర్వహించనున్నారు. 400 రోజులపాటు 4 వేల కిలోమీటర్లు సాగే ఈ పాదయాత్రకు 'యువగళం' అని పేరు పెట్టారు. చిత్తూరు జిల్లా కుప్పంలో పాదయాత్ర ప్రారంభమై రాష్ట్ర వ్యాప్తంగా సాగనుంది. పాదయాత్రకు సంబంధించిన పోస్టర్లు, ప్రచార చిత్రాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె. అచ్చెన్నాయుడు బుధవారం టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ మాదిరిగా సినిమా షూటింగులా, ముందస్తు ప్రణాళికతో మోసకారి చర్యలు పాదయాత్రలో ఉండవన్నరు. ప్రతి ఒక్కరు తమ బాధను పంచుకునే అవకాశాన్ని ఇస్తామని చెప్పారు. యువత ఆశలు, ఆశయాలు నిజం చేసే శక్తి లోకేష్‌కు ఉన్నాయన్నారు. ఈ వాస్తవాన్ని వాస్తవాన్ని యువతీయువకులు గుర్తించాలన్నారు. పాదయాత్రను నిరాంటకంగా సాగేలా సహకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అడ్డుకోవాలని చూస్తే కొరివితో తలగోక్కోవడమేనని హెచ్చరించారు. పెన్షన్ల పెంపు గురించి ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఆఖరికి కలెక్టర్లు కూడా అబద్ధాలే చెప్పాలని, తిట్టాలని హుకుం జారీ చేస్తున్నారని మండిపడ్డారు. సామాజిక పెన్షన్‌ను రూ.2వేలు చేసింది చంద్రబాబే అని చెప్పారు. యువతీ యువకులందరు ఈ యాత్రలో అడుగేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ పొలిట్ బ్యూరోసభ్యులు నక్కా ఆనంద్‌బాబు, కాల్వ శ్రీనివాసులు, షరీఫ్, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత కోరారు. మాజీమంత్రి నిమ్మకాయల చినరాజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైయాష్ నిర్వహణకు పోర్టల్

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వచ్చే ఫ్లైయాష్‌తోపాటు కాలుష్య వ్యర్థాలను వెదజల్లే పరిశ్రమలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పర్యావరణ, ఇంధన, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. విజయవాడలోని ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో కాలుష్య నివారణ చర్యలపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కాలుష్య కారక వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్తగా ఏర్పాటుచేసిన పోర్టల్‌ను ప్రారంభించి మాట్లాడారు.

థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తి అయ్యే ఫ్లైయాష్ నిర్వహణను ఇకపై ఎపి ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ పోర్టల్‌లో ఫ్లైయాష్ ఉత్పత్తి, కొనుగోలుదారులు, రవాణాదారులకు సంబంధించిన పూర్తి సమాచారం వుంటుందని తెలిపారు. ఫ్లైయాష్‌ను వినియోగించే సిమెంట్ కంపెనీలు, టైల్స్, రెడీమిక్స్ కంపెనీలు, జాతీయ రహదారుల నిర్మాణం, ఇటుకలు తయారు చేసే పరిశ్రమలను ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి తెస్తున్నామని చెప్పారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి నీరబ్ కుమార్ ప్రసాద్, కార్పోరేషన్ ఎమ్‌డి ఖజూరియా, చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెత్తపన్ను రద్దు చేసే వరకూ ఆందోళనలు

- మంగళగిరిలో ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)



వామపక్షాలు, రాజకీయపార్టీల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

రాష్ట్ర ప్రభుత్వం విధించిన చెత్త పన్ను రద్దు చేసే వరకు ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వివిధ రాజకీయ పార్టీల నాయకులు హెచ్చరించారు. చెత్త పన్ను రద్దు చేయాలని, నీటి మీటర్లను ఉపసంహరించుకోవాలని, ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ, సిపిఎం, టిడిపి, సిపిఐ ఎంఎల్, చాంబర్ ఆఫ్ కామర్స్, కాంగ్రెస్, దళిత సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలో పాత బస్టాండ్ నుండి గౌతమ్ బుద్ధ రోడ్, మిద్దె సెంటర్, మెయిన్ బజార్, గాలిగోపురం మీదగా కార్పొరేషన్ కార్యాలయం వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో కూడా చెత్త పన్ను విధించలేదని విమర్శించారు. నిత్యవసర ధరలు పెరిగి ప్రజలు ఒకవైపు ఇబ్బందులు పడుతుంటే మరో వైపు చెత్తపన్ను, నీటి పన్ను అంటూ ప్రభుత్వం భారాలు వేయడం తగదన్నారు. పన్ను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య మాట్లాడుతూ నీటి కుళాయిలకు మీటర్లు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని విమర్శించారు. టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త ఎన్ అబద్దయ్య మాట్లాడుతూ సమస్యలపై ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. సిపిఐ ఎంఎల్ నాయకులు కె కోటేశ్వరరావు మాట్లాడుతూ చెత్తపై పన్ను వసూలు చేసే బాధ్యతను వలంటీర్లకు చెప్పి, వసూలు చేయకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, , చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి రామారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏం చేశామని ప్రజలను ఓట్లు అడుగుతాం

- పింఛన్లు ఇస్తే ఓట్లు వేస్తారా?
- వైసిపి పాలనపై ఎమ్మెల్యే ఆనం కీలక వ్యాఖ్యలు

ప్రజాశక్తి - రాపూరు (నెల్లూరు)

రాష్ట్రంలో వైసిపి పాలనపై ఆ పార్టీ ఎమ్మెల్యే ఆనం రామనారాణరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో నూతనంగా నియమించిన సచివాలయ వైసిపి కన్వీనర్లు, వలంటీర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ఏం పనులు చేశామని ప్రజలను ఓట్లు అడుగుతామని అన్నారు. కొత్త ప్రాజెక్టులు కట్టామా? కొత్త వాటికి శంకుస్థాపన చేశామా? పనులు మొదలు పెట్టామా? అని ప్రశ్నించారు. కనీసం రోడ్లపైన గుంతలు కూడా పూడ్చలేకపోయామని తెలిపారు. ఇల్లు కడతామని లేఅవుట్‌లు వేసినా ఇప్పటికీ ఒక్క ఇంటినైనా కట్టలేదని అన్నారు. కేవలం పింఛన్లు ఇస్తే ఓట్లు వేస్తారా? అలాగైతే గత ప్రభుత్వమూ పింఛన్లు ఇచ్చింది కదా? అని అన్నారు. ఎస్ఎస్ కెనాల్ కడతామని ఎన్నికల వేళ హామీ ఇచ్చామని, మూడున్నరేళ్లు అయినా పట్టించుకోలేదని తెలిపారు. ఇదే విషయాన్ని అనేకసార్లు సిఎం దృష్టికి తీసుకెళ్లామని, అసెంబ్లీలోనూ ప్రస్తావించామని చెప్పారు. ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. కంటిముందు నీళ్లు ఉన్నాయని సంతోషపడడమేగానీ తాగలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కండలేరు దగ్గరే ఉన్న రాపూరులో ఒక్క చెరువులో నీళ్లు నింపలేకపోయామని తెలిపారు. కండలేరు అభివృద్ధి విషయంలో వైఎస్ఆర్ కలను నెరవేర్చలేకపోయామన్నారు. గ్రామాల్లో బిందెడు నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని ధ్వజమెత్తారు.

సామాజిక పింఛన్లు తొలగించొద్దు

సిఎంకు పవన్‌కల్యాణ్ బహిరంగలేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సామాజిక పింఛన్లను తగ్గించుకునే దిశగా రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కసరత్తు సరికాదని, వెంటనే ఆ ప్రక్రియను ఉపసంహరించుకోవాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ కోరారు. ఈ మేరకు సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం బహిరంగలేఖ రాశారు. లబ్ధిని తొలగించేందుకు చూపించిన కారణాలు సహేతకంగా లేవని, ఇప్పటి వరకు నాలుగు లక్షల మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలంలో కొందరు వృద్ధులకు పింఛన్లు రద్దు నోటీసులు ఇచ్చి, ఒక్కొక్కరి పేరున వేల ఎకరాల భూములున్నాయని చూపారన్నారు. అదే నిజమైతే ఆయా భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు వారికి ఇప్పించాలని లేఖలో పేర్కొన్నారు. పెనుకొండ ప్రాంతంలో రజక వృత్తిపై ఆధారపడిన పింఛనుదారు రామక్కకు 158 ఇళ్లు ఉన్నాయని నోటీసులో పేర్కొన్నారని, అదే నిజమైతే ఆ ఇళ్లు చూపించి, వాటి తాళాలు రామక్కకు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. వికలాంగులకు నాడు ఇచ్చిన ధ్రువపత్రాలు నేడు చూపించాలని ఒత్తిడి చేయడంలో ఉద్దేశం ఏమిటని, వైకల్యం కళ్లెదుటే కనిపిస్తున్నా లబ్ధికి దూరం చేస్తామనడం భావ్యమేనా? అని ప్రశ్నించారు.

పింఛన్ల తొలగింపు ఆపాలి : సిఎంకు లోకేష్ లేఖ

అడ్డగోలు నిబంధనలు, అబద్ధపు నోటీసులతో ఇష్టారాజ్యంగా పింఛన్లను తొలగించడం ఆపాలని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సిఎంకు బుధవారం లేఖ రాశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వయోపరిమితి నిబంధనలతో సుమారు 18.75 లక్షల పెన్షన్లను రద్దు చేశారని, ఇప్పుడు ఆరు లక్షల మంది పింఛన్లను రద్దు చేయాలనుకోవడం అన్యాయమని తెలిపారు. పింఛను తీసేయడానికి చూపిస్తున్న భూములు, భవనాలు, ఆస్తులన్నీ ఆయా లబ్ధిదారులకు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. సదరం పత్రాలు జారీ నిలిపేసి, వికలాంగులు ఆ పత్రాలు తేవాలని నిబంధన పెట్టడం పింఛన్లకి కోత వేయడానికేనని విమర్శించారు. కుటుంబంలో ఎవరో ఆదాయపు పన్ను కడుతున్నారని, 300 యూనిట్ల విద్యుత్ వాడారని నిరాశ్రయులైన వారి పింఛన్లు తొలగించడం దారుణమని పేర్కొన్నారు.

ఆ వార్తలు అవాస్తవం

- మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

తన ఫ్లెక్సీలను ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు చింపేశారనే వార్తలు అవాస్తవమని మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న వార్తలకు ఖండనగా ఆయన పల్నాడు జిల్లా నరసరావుపేటలోని తన నివాసంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. 50 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తాను ఆరోగ్య కారణాలు, కరోనా నేపథ్యంలో మూడేళ్ల నుండి ప్రజలకు అందుబాటులో లేనన్నారు. నూతన సంవత్సరంతోపాటు, పుట్టినరోజు వేడుకలను అభిమానుల సమక్షంలో నిర్వహించుకుంటూ వారికి అందుబాటులో ఉండేందుకు నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇందులో భాగంగా తన అభిమానులు ఫ్లెక్సీలు వేయించారని, వారికి రాజకీయ అవగాహన లేకపోవడంతో కొన్ని నినాదాలు రాయించారని తెలిపారు. తన అభిమానులను ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులు అడ్డుకున్నారనే ప్రచారం నిజం కాదని, తమ మధ్య విభేదాలేమీ లేవని స్పష్టం చేశారు.

వైసిపి నుంచి తన కుమారుడు మహేష్‌రెడ్డి మళ్లీ గురజాల నుంచి, శ్రీనివాసరెడ్డి నరసరావుపేట నుంచి పోటీ చేస్తారని తెలిపారు. తాను మాత్రం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

ఉద్యోగుల ఫోన్ నెంబర్లు ఇవ్వాల్సిందే

శాఖలకు జిఎడి ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ముఖచిత్ర ఆధారిత హాజరు విధానంలో భాగంగా రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరి ఫోన్ నెంబర్లను ప్రభుత్వం సేకరిస్తోంది. ఈ మేరకు అన్ని శాఖలకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం అందించిన ఫోన్ నెంబర్లను ఉపయోగించుకుంటున్న, సొంతంగా ఫోన్‌లను ఉపయోగించు కుంటున్న వారివి కూడా అందించాలని పేర్కొంది. వీటితోపాటు ఆయా ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన సిఎఫ్ఎంఎస్ నెంబర్లను కూడా నివేదించాలని పేర్కొంది. తాజాగా అందరు ఉద్యోగులు తప్పనిసరిగా ముఖచిత్ర ఆధారిత హాజరు నమోదు చేయాల్సిందేనని స్పష్టం చేసిన నేపథ్యంలోనే ఫోన్ నెంబర్లను కూడా సేకరిస్తుండడం గమనార్హం.

నేడు ఉన్నత విద్యా ప్రణాళిక మండలి సమావేశం


వివరాలు వెల్లడిస్తున్న హేమచంద్రారెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ఉన్నత విద్యా ప్రణాళిక మండలి 4వ సమావేశం గురు, శుక్రవారాల్లో గుంటూరు జిల్లా లాం వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి తెలిపారు. వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఉన్నత విద్యా ప్రణాళిక మండలి సమావేశానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు హాజరవుతారని తెలిపారు. సామాజిక స్పృహను ఉన్నత విద్యా సంస్థలు సమాజంలోకి తీసుకెళ్లడంపై రెండు రోజుల సదస్సులో చర్చిస్తామని వివరించారు. విద్యా విధానాలు రూపొందించడంలోనూ, పరిశోధన అంశాలు అన్ని విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేయడమే ఈ మండలి ఏర్పాటు ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభోపన్యాసం చేస్తారని తెలిపారు.

సంపాదకీయం

గ్యారంటీ లేని 'ఉపాధి'

దేశంలోని కోట్లాది గ్రామీణ శ్రామికులకు కనీస ఉపాధిని గ్యారంటీ చేసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి (నరేగా) కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తూట్లు పొడుస్తోంది. అందుకు ఎనిమిదిన్నరేళ్లల్లో ఎన్నెన్నో దృష్టాంతాలు కనిపిస్తాయి. తాజాగా డిసెంబర్ 14న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా వండి వార్చిన గణాంకాలు, చేసిన విశ్లేషణలు ఉపాధి హామీ పట్ల సర్కారు వ్యతిరేకతకు పరాకాష్ట. దేశంలో 'ఉపాధి' పని కావాలనే కార్మిక కుటుంబాల సంఖ్య తగ్గుతోందని పచ్చి అబద్ధాలతో మంత్రి తప్పుదారి పట్టించారు. పనుల కోసం 2020-21లో 8.55 కోట్ల కుటుంబాల నుంచి డిమాండ్ రాగా 2021-22లో 8.05 కోట్ల కుటుంబాలకు డిమాండ్ తగ్గిందని చెప్పుకొచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ వరకు 6.24 కోట్ల కుటుంబాల నుంచే పని కావాలని డిమాండ్ వచ్చిందని వల్లెవేశారు. విత్త మంత్రి కావాలనే కరోనా సంవత్సరాన్ని కొలబద్దగా తీసుకున్నారు. వాస్తవానికి కరోనా కంటే ముందు 2018-19లో డిమాండ్ 5.87 కోట్ల కుటుంబాలు. 2019-20లో 6.16 కోట్ల కుటుంబాలు. ఆ డిమాండ్ కంటే ఈ ఏడాది తొమ్మిది మాసాల్లో వచ్చిన డిమాండ్ అధికం. కానీ కరోనా మొదటి దశ సంవత్సరాన్ని చూపించి, అనంతర కాలంలో డిమాండ్ తగ్గిందనడం వాస్తవాలను కప్పెట్టే కుట్ర.

ఉపాధి హామీ నిధులను సకాలంలో విడుదల చేయకుండా మోడీ ప్రభుత్వం రాష్ట్రాలను సాధిస్తోంది. దాదాపు రూ.10 వేల కోట్ల బకాయిలను కేంద్రం చెల్లించాలని పార్లమెంట్‌కు ప్రభుత్వం వెల్లడించిన గణాంకాలే తెలుపుతున్నాయి. కూలీలకు వేతనాలు రూ.4,700 కోట్లు 18 రాష్ట్రాలకు ఇవ్వాలి. అవకతవకల ఫిర్యాదులతో పశ్చిమబెంగాల్‌కు రూ.2,748 కోట్లు నిలిపేశామని కేంద్రం చెబుతోంది. తక్కిన 17 రాష్ట్రాలు ఏం చేశాయని రూ.రెండు వేల కోట్లు బిగపట్టింది? ఈశాన్య రాష్ట్రం నాగాలాండ్‌లో 4.32 లక్షల జాబ్‌కార్డులున్నాయి. ఆ రాష్ట్రంలో రోజుకూలి రూ.216. కార్మికుల వేతనాలను కేంద్రం రూ.173 కోట్లు బకాయి పెట్టింది. పలు రాష్ట్రాలదీ ఇదే పరిస్థితి. పని చేసిన పక్షం రోజుల్లోపు వేతనాలివ్వాలని చట్టం చెబుతోంది. చట్టాన్ని కేంద్రమే ఉల్లంఘించడమేంటి? ఉపాధి పనుల్లో మెటీరియల్ కాస్ట్ 19 రాష్ట్రాలకు కేంద్రం రూ.5,450 కోట్లు బకాయి పెట్టింది. వాటిలో యానిమేటర్లు, సహాయకులు, పర్యవేక్షకుల వేతనాలు కలిసే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు రూ.700 కోట్లివ్వాలి. ఇంకా పలు రాష్ట్రాలకు అధిక మొత్తంలోనే ఇవ్వాలి. మెటీరియల్ కాస్ట్ చెల్లించకపోతే సరఫరా గొలుసు దెబ్బతింటుంది. మెటీరియల్ సరఫరా చేసే సంస్థలు కొత్త పనులకు సరఫరా చేసేందుకు ఇష్టపడరు. పనులు నిలిచిపోతాయి. కేంద్రం తన వైఫల్యాన్ని చెప్పకుండా పనులకు డిమాండ్ తగ్గిందనడం దుర్మార్గం.

కరోనా లాక్‌డౌన్లతో పట్టణాల్లో ఉపాధి పోయాక 'ఉపాధి హామీ' ప్రాధాన్యత పెరిగింది. వ్యవసాయ సంక్షోభం, భారీ యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ కార్మికుల పని దినాలు తగ్గిపోయి 'ఉపాధి హామీ' అవసరం పెరిగింది. మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకున్న నయా-ఉదారవాద ఆర్థిక విధానాలతో కార్పొరేట్లు విచ్చలవిడిగా తెరమీదికొచ్చారు. గ్రామాల నుంచి పట్టణాలకు కూలీల వలసలు పెరిగితే ఆ మేరకు డిమాండ్ ఏర్పడి తక్కువ వేతనాలకు కార్మికులను దొరకబుచ్చుకొని శ్రమ దోపిడీ చేయాలన్న ఆరాటంలో ఉన్నారు. కార్పొరేట్ల కోసం పని చేస్తున్న మోడీ ప్రభుత్వం వారి ఆకాంక్షలకు తగ్గట్టు ఒక పథకం ప్రకారం 'ఉపాధి హామీ'ని నిర్వీర్యం చేస్తోంది. పలు శాఖలకు అనుసంధానం, నిధుల విడుదలలో జాప్యం అందుకే. గతేడాది రూ.93 వేల కోట్లుగా ఉన్న బడ్జెట్ ఈ సంవత్సరం రూ.73 వేల కోట్లకు తగ్గిపోయింది. ఏడాదిలో కనీసం వంద రోజుల ఉపాధి కల్పనకు 'నరేగా' చట్టం 2006లో వామపక్షాల ఒత్తిడి మూలంగా యుపిఎ సర్కారు హయాంలో వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల రీత్యా ఏడాదికి 200 రోజులపాటు ఉపాధిని గ్యారంటీ చేయాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. మోడీ ప్రభుత్వమేమో ఉన్న చట్టానికి ఎసరు పెడుతోంది. శ్రామికులు అప్రమత్తమై కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటించి ఉపాధికి గ్యారంటీ సాధించాలి.

మంచి మాట



మహిళలను అంధకారం లోను, తెరచాటున ఉంచేసి మీరు మాత్రం ముందుకు నడవాలనుకోవడం వృధా ప్రయాసే. అదెప్పటికీ జరగదు.

- సిస్టర్ నివేదిత

(బ్రిటన్‌లో పుట్టి భారత్‌లో మహిళా విద్యాభివృద్ధికై కృషి చేసిన సంస్కర్త)

విశ్లేషణ

స్మార్ట్ మీటర్లు - నిజానిజాలు

బి. తులసీదాస్



ప్రపంచంలోనూ స్మార్ట్ మీటర్లకు ఎదురుగాలి వీస్తోంది. ఇటువంటి సంస్కరణల్ని తొలుత అమలు చేసిన బ్రిటన్‌లో ఇప్పుడు విద్యుత్, గ్యాస్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. బిల్లులు తప్పల తడికలుగా రావడం ఒకటైతే తమ వినియోగ వివరాలు, ఇతర సమాచారాన్ని ఆయా విద్యుత్ కంపెనీలు అమ్ముకుంటున్నాయని ఆరోపణలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన సమస్యలపై అక్కడి ప్రభుత్వం కూడా స్పందించవలసి వస్తోంది. స్వీడన్, జర్మనీ వంటి ఇంకొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోనూ మీటర్ల వివాదాలున్నాయి. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లోనూ గృహ వినియోగ కనెక్షన్లకు మీటర్లు బిగించడానికి పూనుకుంటే ప్రజల నుండి ప్రతిఘటన ఉమ్మడి రాష్ట్రం నాటి విద్యుత్ ఉద్యమాన్ని తలపించినా ఆశ్చర్యపోనక్కరలేదు. సర్కారు వారూ తస్మాత్ జాగ్రత్త!

వ్యవసాయ పంప్ సెట్లకు ప్రభుత్వ ఖర్చుతో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామని చెబుతూ వస్తున్న ప్రభుత్వం ఇప్పుడు మిగతా అన్ని కనెక్షన్లకూ 2025 నాటికి అవి తప్పనిసరి అని ప్రకటించింది. వ్యవసాయ మీటర్ల ఖర్చు మాత్రమే సర్కారు భరిస్తుందనీ, మిగతా వినియోగదార్లు డబ్బు చెల్లించాల్సిందేనని లోగుట్టు విప్పింది. ఆరు నెలల్లోనే అందుకు ప్రక్రియ ప్రారంభిస్తామని, తొలుత 500 యూనిట్లు ఆ పైబడి నెలసరి వాడే కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామని, ఇది తప్పనిసరి నిబంధన అని కూడా రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డిఎస్ఎస్) అమలులో ఇది భాగమనీ చెప్పారు. చెత్త పన్ను విధింపు, ఆస్తి పన్ను పెంపు, వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్ల బిగింపు వగైరాల మాదిరిగా ఈ భారమూ కేంద్రం చలవే! 'దేవుడు శాసిస్తాడు.. అరుణాచలం పాటిస్తాడు' అన్న సినిమా డైలాగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం గుర్తుకు తెస్తోంది కదా!

విద్యుత్ ఆదా నిజమేనా..!

శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగించాక రాష్ట్ర ప్రభుత్వ సర్వే ప్రకారం 30 శాతం, ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ అధ్యయనం ప్రకారం 20 శాతం విద్యుత్ వినియోగం తగ్గిందనీ, ఆ మేరకు ఖజానాకు డబ్బు ఆదా అయిందన్న సర్కారు వాదన నమ్మశక్యంగా లేదు. మీటర్ అంటే వాడే విద్యుత్ ఎంత అని లెక్క తేల్చేదేతప్ప వినియోగాన్ని నియంత్రించేది ఎంతమాత్రమూ కాదు. మరి ఈ ఆదా వాదనకు ప్రాతిపదిక ఏమిటి? అదేం చెప్పడం లేదు సరికదా అధ్యయన నివేదికలను సర్కారు బయటపెట్టడం లేదు. కొన్ని వాణిజ్య ప్రకటనల్లో 'వాడక ముందు', 'వాడిన తరువాత' అంటూ కొన్ని ఫొటోలు ఇస్తుంటారు. అలా ఈ అంశాన్నీ చూద్దాం. మీటర్లు బిగించాక నెలకు ఎన్ని యూనిట్లు కరెంటు వాడారో కచ్చితంగా తెలుస్తుంది. కాని, మీటర్లు బిగించకముందు విద్యుత్ వాడకాన్ని ఎలా లెక్కగట్టారు? అంటే రెండు అవకాశాలున్నాయి. గత రెండు దశాబ్దాలకు పైగా డిస్కాములు చెబుతున్న అంచనా లెక్క. ఇది తప్పుల తడిక అని విద్యుత్ రంగ నిపుణులు ఎన్నో సందర్భాల్లో వివరాలతోసహా ఎండగట్టారు. విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) కూడా కొన్ని సార్లు డిస్కాములకు తలంటింది. కనుక ఇప్పుడూ వాటితోనే పోల్చి చూస్తే ఆదా ఎంత శాతమైనా అయిందని చెప్పేయవచ్చు. దానికి విశ్వసనీయత లేనట్టే!

ఇక రెండో మార్గం ఫీడర్ స్థాయిలో వున్న మీటర్ గత ఏడాది రీడింగ్‌ను, దాని పరిధిలోని అన్ని పంప్‌సెట్ల ఈ ఏడాది వాడకాన్ని పోల్చితే కొంతమేర లెక్క తెలుస్తుంది. అయితే అది కూడా సహేతుకమైన పోలిక కాకపోవచ్చు. గత ఏడాది ఆ ఫీడర్‌లో రోజుకు ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా జరిగింది, ఈ ఏడాది ఎంత సమయం అన్నది పరిశీలించారా? శ్రీకాకుళం జిల్లాలో వ్యవసాయ విద్యుత్ రోజుకు నాలుగైదు గంటలకు మించి ఇవ్వడంలేదని రైతులు చెబుతున్నారు. మరి తక్కువ సమయం సరఫరా చేసి ఆదా తొమ్మిది గంటల ప్రాతిపదికన లెక్కిస్తే! అలాగే గత ఏడాది ఈ రోజుల్లో పడిన వర్షం, ఈ ఏడాది అదెలా వున్నదీ చూశారా? అంతేగాక ఆయా పంప్‌సెట్ల కింద సాగు చేసిన పంటలు ఒకటేనా లేక వేర్వేరా? ఇలాంటి అంశాల్లో వ్యత్యాసాలుంటే లెక్కలు తారుమారు కావచ్చు. ఎందుకంటే ఇది కేవలం పోలిక కదా! ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రయాస్ వారి అధ్యయన నివేదికను, వారి సిఫార్సులనూ వెల్లడిస్తేనే వాస్తవాలు తెలుస్తాయి.

భద్రత, నాణ్యత మెరుగుదల ఎలా...?

మీటర్లు పెట్టాక విద్యుత్ సరఫరాలో నాణ్యత మెరుగు పడిందని, భద్రత పెరిగిందన్న వాదనలూ పరీక్షకు నిలబడేవి కాదు. శ్రీకాకుళం జిల్లాలో పంప్‌సెట్లకు కేవలం మీటర్లు బిగించారేతప్ప మిగతా ఏ మార్పులూ చెయ్యలేదు. అనేకమంది రైతులు తమ షెడ్ లోపల మీటర్ బిగించవద్దంటే సిబ్బంది స్తంభాలవద్దనే మీటర్లు ఏర్పాటు చేశారు. ఈ మాత్రానికే భద్రత, నాణ్యత ఎలా పెరుగుతాయి? అయితే సరఫరాలో సమస్యలను, చిన్న చిన్న ఇబ్బందులను తొలగించుకోవడానికి మాత్రం మీటర్ల ఏర్పాటు ఉపయోగపడిందని రైతులు అంటున్నారు. ఆ జిల్లాలో బిగించినవి అత్యధికం ఇన్‌ఫ్రారెడ్ మీటర్లు కనుక నెలవారీ రీడింగ్ తియ్యడానికి వచ్చే యువకులకు (గతంలో సాధారణంగా ఎవరూ వచ్చేవారు కాదు) రైతులు సమస్యలను వివరించడం, వాటిని కొంతమేర పరిష్కరించడానికి తోడ్పడుతోంది. అంతకుమించి వేరే ప్రయోజనం అదనంగా రాలేదు. పోనీ కొత్తగా ఏమైనా వస్తుందా అంటే అదీ పరిమితమే! తాజా టెండర్‌లో పేర్కొన్నదాని ప్రకారం కొత్తగా ఇచ్చేది మీటర్ బాక్స్, ప్రామాణికమైన ఎర్త్ కనెక్షన్, ఎంసిబి, ఇతర ఏర్పాట్లు రైతు పంప్‌సెట్ షెడ్ పరిధిలోనివే. కొంతమేర ప్రమాదాల నివారణకు తోడ్పడవచ్చు. కాని, ప్రధాన విద్యుత్ ప్రవాహం నడిచే కండక్టర్ల నాణ్యత, సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం, గ్రిడ్ ఫ్రీక్వెన్సీ వంటివి ఈ మీటర్ల ఏర్పాటుతో సంబంధమే లేని అంశాలు.

'స్మార్ట్' అంత కచ్చితమా...!

మన రాష్ట్రంలో వ్యవసాయ విద్యుత్ వాడకం ఎంతో కచ్చితంగా తెలియాలని, అది కూడా ఎప్పటికప్పుడు (రియల్ టైం) తెలియాలనీ ప్రభుత్వం అంటోంది. ఇప్పటికే ఉన్నది, భవిష్యత్తులో సెకి ద్వారా అదానీ కంపెనీ నుండి కొనుగోలు చేయనున్న సౌర విద్యుత్ నిర్వహణకు ఈ సమాచారం అవసరమని, స్మార్ట్ మీటర్ల ద్వారానే అది తెలుస్తుందని చెబుతోంది. అదే నిజమైతే మరి మొత్తం కనెక్షన్లన్నిటికీ స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తానంటోంది? సమాధానం సర్కారు వారే చెప్పాలి. నిజంగా విద్యుత్ వినియోగం మాత్రమే తెలుసుకోవాలంటే ఇప్పటికే వున్న ఫీడర్ స్థాయి మీటర్లను అవసరమనుకుంటే స్మార్ట్ మీటర్లుగా మార్చవచ్చు. అలాగే నిర్దిష్ట సంఖ్యలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కూడా ఏర్పాటు చేస్తే చాలు. పూర్తిగా డిస్కామ్‌ల ఆవరణల్లోనే వుండడమేగాక 90 శాతం వరకు ఖర్చు కూడా తగ్గుతుంది. దాదాపు అన్నీ మొబైల్ నెట్‌వర్క్ కవరేజి ప్రాంతంలోనే ఉంటాయి కనుక రీడింగ్ తీయడానికి మనుషుల అవసరం కూడా రాదు. కాని, ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించడం లేదంటే కేంద్రం ఒత్తిడి ఎంతలా ఉందో మరి!

భారీగా ఖర్చు చేసి ఏర్పాటు చేసే స్మార్ట్ మీటర్లు అన్ని అంశాలనూ కచ్చితంగా తెలియజేస్తాయని, తప్పులుండవనీ ఎవరైనా చెప్పగలరా? ఇటీవలి అసోం అనుభవం చూస్తే వాటి నిర్వాకం బోధపడుతుంది. అసోంలో కూడా పెద్ద సంఖ్యలో స్మార్ట్ మీటర్లు బిగించారు. అక్కడ విద్యుత్ చార్జీలు పెంచకుండానే వినియోగదార్లకు కరెంటు బిల్లులు భారీ మొత్తాలతో రావడంతో సర్కారు దొడ్డిదారిన చార్జీలు పెంచిందని జనం గగ్గోలు పెట్టారు. దాంతో అసోం పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ అలాంటిదేమీ లేదని, కరెంటు వినియోగం పెరిగినందునే బిల్లులలా వచ్చాయని బహిరంగంగా బుకాయించారు. కాని, జనాగ్రహం పెల్లుబకడంతో సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ రంగంలోకి దిగి అదంతా స్మార్ట్ మీటర్ల మూలంగా తలెత్తిందని ప్రజలకు వివరించి, తప్పుడు మీటర్లను వెంటనే మార్చాలంటూ అధికారులను ఆదేశించారు (ఇందుకు సంబంధించి 2022 సెప్టెంబర్ 16న సిఎం చేసిన ట్వీట్ కింద ఇవ్వబడింది.) ఇలాంటి ఉదాహరణలెన్నో పేర్కొనవచ్చు కానీ ఒక ముఖ్యమంత్రి అదీ బిజెపి పాలిత రాష్ట్రానికి చెందినవారు స్వయంగా ఇచ్చిన వివరణ చూశాక అయినా 'స్మార్ట్' సమర్థకులు ఏమంటారో!

> Himanta Biswa Sarma
> @himantabiswa
>
> There has been no hike in power tariff but instances of unreasonable bill amounts have come in from consumers which is due to faulty readings in some of the newly installed smart meters. Instructed @apdclsocial to urgently fix the faulty smart meters and address public grievances
>
> 6:41 PM · Sep 16, 2022

దేశంలో అమలు తీరిలా...

దేశమంతటా 25 కోట్ల స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అందుకోసం 2018 నుండి పలుమార్లు రాష్ట్రాలకు కేంద్ర విద్యుత్ శాఖ మంత్రులు లేఖలు రాశారు. ఆకర్షణీయ పథకాలను కేంద్రం ప్రకటించింది. రూ.3.05 లక్షల కోట్లతో ప్రతిపాదించిన ఆర్‌డిఎస్ఎస్ ప్రధాన లక్ష్యం స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటే! నేషనల్ స్మార్ట్ గ్రిడ్ మిషన్ వెబ్‌సైట్‌లో సమాచారం ప్రకారం 2022, డిసెంబర్ 23 నాటికి (ఈ నాలుగేళ్లలో) దేశమంతటా బిగించిన స్మార్ట్ మీటర్ల సంఖ్య 52,93,062 మాత్రమే. ఇందులోనూ అయిదు రాష్ట్రాలు బీహార్ 12,28,945, ఉత్తరప్రదేశ్ 11,72,392, హర్యానా 6,12,106, రాజస్థాన్ 5,62,520, అసోం 4,55,879 కలిపితే 76 శాతం కావడం గమనార్హం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి దశలో వ్యవసాయంలో 18.5 లక్షలు, మిగతా రంగాల్లో నెలసరి వాడకం 500 యూనిట్లకన్నా ఎక్కువగా ఉండే 28 లక్షల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తామని ప్రకటించింది. ఇప్పటివరకు దేశమంతటికీ మంజూరైన స్మార్ట్ మీటర్ల సంఖ్య 1,12,75,739. రాష్ట్ర ప్రభుత్వం ఎంతలా ఊదరగొట్టినా ఈ స్మార్ట్ ప్రక్రియ అంత తేలిగ్గా జరిగేది కాదు. విద్యుత్ సంస్కరణల్లో దేశంలోనే ముందున్న ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో దాదాపు ఖాతా తెరవని పరిస్థితి. వివిధ రాష్ట్రాల్లో నిరసనలు, ప్రతిఘటనలూ ఉధృతంగానే జరిగాయన్న విషయం మరువరాదు.

ప్రపంచంలోనూ స్మార్ట్ మీటర్లకు ఎదురుగాలి వీస్తోంది. ఇటువంటి సంస్కరణల్ని తొలుత అమలు చేసిన బ్రిటన్‌లో ఇప్పుడు విద్యుత్, గ్యాస్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. బిల్లులు తప్పుల తడికలుగా రావడం ఒకటైతే తమ వినియోగ వివరాలు, ఇతర సమాచారాన్ని ఆయా విద్యుత్ కంపెనీలు అమ్ముకుంటున్నాయని ఆరోపణలు కుప్పలు తెప్పలుగా వస్తున్నాయి. వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన సమస్యలపై అక్కడి ప్రభుత్వం కూడా స్పందించవలసి వస్తోంది. స్వీడన్, జర్మనీ వంటి ఇంకొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోనూ మీటర్ల వివాదాలున్నాయి. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లోనూ గృహ వినియోగ కనెక్షన్లకు మీటర్లు బిగించడానికి పూనుకుంటే ప్రజల నుండి ప్రతిఘటన ఉమ్మడి రాష్ట్రం నాటి విద్యుత్ ఉద్యమాన్ని తలపించినా ఆశ్చర్యపోనక్కరలేదు. సర్కారు వారూ తస్మాత్ జాగ్రత్త!

★

విమర్శ

జి-20 : భారత్‌కు ఒరిగేదేమిటి?



ఎ. కోటిరెడ్డి



భారత ప్రధాని మోడీ 2022 డిసెంబరు 1వ తేదీన జి-20 అధ్యక్ష స్థానాన్ని అధిష్టించారు. ఆయన సంవత్సరం పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఇప్పటి వరకు అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన ఇండోనేషియా నుండి ఆయన ఈ బాధ్యతను స్వీకరించారు. 19 దేశాలు, యూరోపియన్ యూనియన్ సభ్యులుగా ఉన్న జి-20 కూటమిలో సంవత్సరానికి ఒక దేశం అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తుంది. సంస్థ నిబంధనల ప్రకారం తమ సమయం వచ్చినపుడు సభ్యులుగా ఉన్న 20 దేశాలలోని ప్రతి దేశమూ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తుంది. అది పెద్ద దేశమైనా, చిన్న దేశమైనా, ఆయా దేశాలలో సమర్థులైన నాయకులు అధికారంలో ఉన్నారా లేదా అసమర్థులు అధికారంలో ఉన్నారా అన్నదానితో నిమిత్తం లేకుండా ఆ దేశం సమయం వచ్చినపుడు అధ్యక్ష బాధ్యతలు చేపడుతుంది. ప్రస్తుతం భారతదేశం వంతు వచ్చింది. ఇపుడు భారత ప్రధానిగా మోడీకి బదులు మరెవరున్నా మన దేశం జి-20 కి అధ్యక్షత వహించేది. కాని మోడీ అధికారంలో ఉండటం వలననే భారతదేశానికి జి-20 అధ్యక్ష స్థానం దక్కిందని భక్తశిఖామణులు ప్రచారం చేస్తున్నారు. స్వయంగా మోడీయే అందుకు నాయకత్వం వహించి, ఇదేదో ప్రపంచ అద్భుతమైనట్లు ప్రచారం చేసుకొంటున్నారు. "ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్" అన్నది జి-20 ప్రధాన నినాదంగా ఉంటుందని ప్రచారం చేస్తున్నాడు. డిసెంబరు 5వ తేదీన మోడీ ఢిల్లీలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, జి-20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దేశంలో 200 సభలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. వాస్తవంగా ఆ సమావేశమే అనవసరం. కాని ఇదే అంశంపై 200 సభలు జరపటమంటే వాస్తవ సమస్యల నుండి ప్రజల దృష్టి మళ్ళించటం కోసం జి-20 అధ్యక్ష స్థానాన్ని బిజెపి ఏ విధంగా వినియోగించుకోబోతున్నదో స్పష్టమౌతున్నది.

ప్రజల సమస్యలకు చోటే లేని జి-20

ప్రపంచంలో పెద్ద ఆర్థిక వ్యవస్థలు ఉన్న 20 దేశాలతో 1999లో జి-20 ఏర్పాటైంది. ఆనాడు ఆసియా దేశాలలో తలెత్తిన ఆర్థిక సంక్షోభం, దానిని పరిష్కరించటంలో జి-7 దేశాల అసమర్థత, సంక్షోభ భారాన్ని భరించటంలో ఇతర దేశాలను కూడా భాగస్వాములను చేయాలనే వ్యూహంలో భాగంగా జి-7ను జి-20గా మార్చారు. ఇందులో అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికాలు ఉన్నాయి. ఇ.యు మొత్తం ఒకటిగా 20వ సభ్యునిగా ఉంది. శాశ్వత అతిథిగా స్పెయిన్‌ను ఆహ్వానిస్తున్నారు. 2008లో అమెరికాలో గృహ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుండి జి-20 అగ్ర నాయకుల సమావేశాలు జరగటం ప్రారంభమైంది. 2022లో ఇండోనేషియా లోని బాలిలో జి-20 దేశాల అగ్రనాయకుల చివరి సమావేశం జరిగింది. ఈ సమావేశాలలో అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య స్థిరత్వం, ఆయా సభ్యదేశాలకు పరస్పర ప్రయోజనం ఉన్న ఇతర విషయాలను గురించి చర్చలు జరుగుతాయి. దీనికి శాశ్వత స్టాఫ్, ఆఫీసు లేవు. కాబట్టి హెడ్‌క్వార్టర్స్ సభ్యదేశాల మధ్య రొటేట్ అవుతుంది. నిర్ణయాలు ఏకాభిప్రాయంతో జరుగుతాయి. నిర్ణయాలను అమలుచేయటం అనేది ఆయా దేశాల రాజకీయ సంకల్పంపై ఆధారపడి వుంటుంది. అప్పటి పాలకులకు ఆ నిర్ణయాలతో ప్రయోజనం ఉందనుకుంటే అమలుచేస్తారు. లేదంటే పక్కన పెట్టేస్తారు.

జి-20 సభ్యదేశాలలో ప్రపంచ జనాభాలో 60 శాతం ఉన్నారు. 80 శాతం ప్రపంచ జి.డి.పికి, 75 శాతం ఎగుమతులకు ఈ దేశాలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. మొత్తం సభ్యదేశాలు ఐదు గ్రూపులుగా ఏర్పడతాయి. ప్రతి గ్రూపులోనూ కనీసం నాలుగు దేశాలు ఉంటాయి. ప్రతి సంవత్సరం ఒక గ్రూపు నుండి అధ్యక్షుని ఎన్నుకుంటారు. ఎన్నికైన అధ్యక్షుడు, గత అధ్యక్షుడు, రానున్న సంవత్సరం అధ్యక్ష స్థానం స్వీకరించేవారు, ఈ ముగ్గురూ కలిసి సెక్రటేరియట్‌గా వ్యవహరిస్తారు. 19 సభ్య దేశాలలో 11 దేశాలు ఇప్పటికి అధ్యక్షస్థానం అలంకరించాయి.

2019 ఎన్నికలలో వినియోగించుకోవటానికి మోడీ జి-20 అధ్యక్షస్థానం కోసం 2016 లోనే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నం ఫలించి ఉంటే 2018లో భారతదేశం అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేది. 2024 ఎన్నికల కోసం ఇపుడు ఉపయోగించుకోవాలనుకుంటున్న అధ్యక్ష స్థానాన్ని ఆనాడు 2019 ఎన్నికలలో వినియోగించుకునే వారు. కాని ఆనాడు అర్జెంటీనా గట్టిగా పోటీ పడటంతో భారతదేశానికి అధ్యక్షస్థానం దక్కలేదు. భారతదేశం ఉన్న గ్రూపులో భారత్‌తో పాటు రష్యా, దక్షిణాఫ్రికా, టర్కీ ఉన్నాయి. టర్కీ, రష్యాలు ఇంతకు ముందే అధ్యక్ష బాధ్యతలు నిర్వహించి ఉన్నాయి. కనుక భారతదేశానికి మార్గం సుగమమైంది. వాస్తవం ఇది కాగా మోడీ చరిష్మాతోనే భారతదేశానికి జి-20 అధ్యక్ష స్థానం వచ్చినట్లు, దేశ ప్రతిష్ట ప్రపంచ స్థాయిలో విస్తరించినట్లు బాకాలూదుతున్నారు. వాస్తవంగా జి-20 విధానాల అమలులో మోడీ ప్రమేయం ఉండదు. అగ్రదేశాలే విధానాలను నిర్ణయిస్తాయి. హిజ్ మాస్టర్స్ వాయిస్ లాగా వాటిని చిలుక పలుకులు పలకటం మినహా ఆయన చేసేదేమీ ఉండదు. సామ్రాజ్యవాదులకు మన దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నవాడు, పారిశ్రామిక, వ్యవసాయ, గనులు, వనాలు మొత్తాన్ని కట్టబెడుతున్నవాడు జి-20 ద్వారా ఉద్ధరిస్తానని చెబుతున్నాడు. ఏ విధంగా మోసం చేసినా ప్రజలు నోరు మెదపరనే ధీమాయే ఇందుకు కారణం కదా!

భారతదేశం అధ్యక్ష స్థానంలో ఉన్నా ఆ విధానాలను అమలుచేయమని చెప్పటం మినహా మన దేశానికి, మన ప్రజలకు మేలు చేసే ఒక్క విషయాన్ని కూడా చర్చకు పెట్టి, నిర్ణయాలు చేయటానికి అవకాశం ఉండదు. దేశీయ సమస్యలతో సంబంధమే లేని అంశాలను తీసుకువచ్చి, ప్రజలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయటానికి 175 నగరాలలో పైన పేర్కొన్న 200 సభలు జరపటానికి కార్యక్రమం రూపొందించారు. దేశ ప్రజలకు ఏం ప్రయోజనం జరుగుతుందా అని కాకుండా సాధారణంగా మారే జి-20 అధ్యక్ష స్థానాన్ని దేశ ప్రజలను మోసం చేయటానికి ఎంత బాగా వినియోగించుకుంటున్నారో వెల్లడౌతున్నది.

భారత ప్రజలకు ప్రయోజనమేమిటి?

జి-20లో ప్రపంచ దేశాల ఆర్థిక, ద్రవ్య సమస్యలను గురించి చర్చించటమే ప్రధానాంశంగా ఉంటున్నది. ఆ విధానాలకే ఆ సంస్థ పరిమితమైంది. భారతదేశం అధ్యక్ష స్థానంలో ఉన్నా ఆ విధానాలను అమలుచేయమని చెప్పటం మినహా మన దేశానికి, మన ప్రజలకు మేలు చేసే ఒక్క విషయాన్ని కూడా చర్చకు పెట్టి, నిర్ణయాలు చేయటానికి అవకాశం ఉండదు. దేశీయ సమస్యలతో సంబంధమే లేని అంశాలను తీసుకువచ్చి, ప్రజలలో పెద్ద ఎత్తున ప్రచారం చేయటానికి 175 నగరాలలో పైన పేర్కొన్న 200 సభలు జరపటానికి కార్యక్రమం రూపొందించారు. దేశ ప్రజలకు ఏం ప్రయోజనం జరుగుతుందా అని కాకుండా సాధారణంగా మారే జి-20 అధ్యక్ష స్థానాన్ని దేశ ప్రజలను మోసం చేయటానికి ఎంత బాగా వినియోగించుకుంటున్నారో వెల్లడౌతున్నది. మోడీ ఇచ్చిన నినాదాలు "ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్" కూడా సంఘ్ పరివార్ కపటత్వానికి తగిన విధంగానే ఉన్నాయి. సామరస్యంతో జీవించే ప్రజల మధ్య కుల, మత విద్వేషాలను పెంచి పోషిస్తూ ఘర్షణలు, హత్యాకాండను ప్రోత్సహిస్తున్న మోడీ ఈ నినాదాలను ఇవ్వటం శాంతి కోరుతున్న వారిని పరిహసిస్తున్నట్లు ఉంది.

భారత్‌కు జి-20 అధ్యక్ష స్థానం రావటం వలన ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ట పెరిగినట్లు ప్రచారం చేస్తున్నారు. దీని వలన వీసమెత్తుకూడా భారత ప్రతిష్ట పెరగదు. కాని మోడీ ప్రధాని అయి, సంఘ్ పరివార్ శక్తులు అధికారం చేజిక్కించుకున్న తరువాత అంతర్జాతీయంగా భారతదేశ ప్రతిష్ట మంటగలుస్తున్నది. దేశంలో మైనారిటీలపై దాడులు, హత్యలు పెరిగాయి. దళితులు, గిరిజనులపై దాడులు పెరిగాయి. అంతర్జాతీయంగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్న జె.ఎన్.టి.యు వంటి విశ్వవిద్యాలయాలను ధ్వంసం చేస్తున్నారు. జర్నలిస్టులపై హత్యాకాండ, అరెస్టులు కొనసాగిస్తున్నారు. విధానపరంగా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న వారిపై దేశద్రోహం కేసులు పెడుతున్నారు. జమ్మూ-కాశ్మీర్‌కున్న 370, 35ఎ అధికరణాలను రద్దు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం అడుగంటుతున్నదని అంతర్జాతీయ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ప్రపంచ ఆకలి సూచీ, స్వేచ్ఛ, మహిళల ఉపాధి, నేరాలు, దేశ ప్రజలపై ప్రభుత్వ గూఢచర్యం తదితరాలు అంతర్జాతీయంగా దేశం పరువును బజారుకీడ్చాయి. ఇటువంటి పరిస్థితులలో దేశం అట్టడుగుకు చేరుతున్న అంశాలను గురించి పట్టించుకోకుండా జి-20 అధ్యక్ష బాధ్యతలను గురించి గొప్పగా ప్రచారం చేయటం... ప్రజలపై, ప్రజాస్వామ్యంపై దాడులను మరింత తీవ్రం చేయటానికే. ★

కవిత్వం

చలనశీలతే వరం

అవునూ...
నెత్తుటి చుక్కకు నేర్పిందెవరు?
నిన్ను చూస్తేనే భయపడేంత
ఎరుపెక్కాలి నువ్వని.
ఎప్పుడూ
విడివిడిగా ఉండే
కారుమబ్బులను ఎకాయెకి కలిపిందెవరు?
తాత్కాలికంగా వెలుగును
తరిమివేయాలి మీరని.
అప్పటికప్పుడు
ఆకులు రాల్చుకొమ్మని
చెట్లను ఆతురత పెట్టిందెవరు?
అవసానాన్ని అంత కష్టపడి
మోయాల్సిన అవసరం మీకు లేదని.
మలినాలన్నీ
తొలినాళ్లలోనే తోసివేయమని
నదులకు నిధులిచ్చి మరీ
విధులప్పజెప్పిందెవరు?
నీలి రంగుతో ఒళ్ళంతా
నిగనిగలాడాలి నువ్వని.
గమ్యం లేని
గమనం చేయమని
గాలికి చెప్పిందెవరు?
ప్రాణులకు చలనశీలతనిచ్చే
వరమవ్వాలి నువ్వని.
కదిలే ప్రతి సృష్టి
ప్రేరణాత్మకమైన ఓ కథ
చెబుతూనే ఉంది
నేర్చుకో మెల్లగా.
నేడో రేపో
నిన్ను నీవు మార్చుకో
అందమైన హరివిల్లుగా.

- కమలేశ్, సెల్ : 9160396596

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

సబ్సిడీ ఆహార ధాన్యాలు కొనసాగించాలి

- సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్
- తీవ్రమవుతున్న మతోన్మాద ధోరణులపై ఆందోళన
- న్యాయ వ్యవస్థ స్వేచ్ఛకు రక్షణ కల్పించాలి



న్యూఢిల్లీ : ఉచిత ఆహార ధాన్యాలతో పాటు సబ్సిడీ ఆహార ధాన్యాలనూ కొనసాగించాలని సిపిఎం డిమాండ్ చేసింది. 2013 నాటి ఆహార భద్రతా చట్టం కింద 2023 సంవత్సరానికి దాదాపు మూడింట రెండు వంతుల మంది ప్రజలకు ఉచితంగా రేషన్ అందివ్వడమంటే, ఈ పథకం లేకపోతే దేశాన్ని వేధిస్తున్న ఆకలి బాధను అధిగమించలేమని ప్రభుత్వం అంగీకరించినట్లేనని పొలిట్‌బ్యూరో పేర్కొంది. భారతదేశంలో ఆకలి బాధలు చాలా తీవ్రంగా వున్నాయంటూ గ్లోబల్ హంగర్ ఇండెక్స్ పేర్కొనడాన్ని మోడీ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఇది వాస్తవమన్నది సుస్పష్టమైందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) పొలిట్‌బ్యూరో ఈ నెల 27, 28 తేదీల్లో ఢిల్లీలో సమావేశమై పలు అంశాలపై చర్చించింది.

కేంద్ర ప్రభుత్వం 81.35కోట్ల మంది ప్రజలకు 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఒకవైపు ఉచితంగా అందిస్తూనే, మరోవైపు ఆహార భద్రతా చట్టం (ఎఫ్ఎస్ఎ) కింద ప్రస్తుతం సబ్సిడీ రేట్లకు ఇచ్చే కిలో బియ్యం రూ.3, కిలో గోధుమలు రూ.2, పప్పు ధాన్యాలు కిలో రూపాయి చొప్పున ఐదు కిలోల ఆహార ధాన్యాలు ఇవ్వడాన్ని తిరస్కరిస్తోంది. పర్యవసానంగా, సబ్సిడీ రేట్లతో కూడిన ఆహార ధాన్యాల స్థానే ప్రజలు బహిరంగ మార్కెట్‌కు వెళ్ళి కొనుగోలు చేయాల్సి వస్తుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. పౌష్టికాహారాన్ని పొందడానికి ఈ ఆహార ధాన్యాలు అత్యవసరం కూడా. బహిరంగ మార్కెట్లో గోధుమలను కిలో రూ.30పైనే విక్రయిస్తుండగా, బియ్యం ధర కిలోకు రూ.40పైనే వుంటోంది. కోట్లాది పేద కుటుంబాలకు ఇది తీవ్రమైన ఎదురు దెబ్బ కాగలదని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ పరిస్థితుల్లో పిఎంజికెఎవై కింద ఇచ్చే 5కిలోల ఉచిత ఆహార ధాన్యాలతో పాటు ఎఫ్ఎస్ఎ కింద సబ్సిడీ రేట్లకు ఇచ్చే 5 కిలోల ఆహార ధాన్యాలను కూడా కొనసాగించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది.

పెరుగుతున్న నిరుద్యోగం

నిరుద్యోగితా రేటు పెరుగుతునే వుంది. దీనితో పాటు కార్మిక ప్రాతినిధ్యం రేటు, ఉపాధి రేటు కూడా తగ్గుతోంది. నవంబరులోని 8శాతంతో పోలిస్తే డిసెంబరులో నిరుద్యోగం రేటు 8.8శాతానికి పెరిగింది. పట్టణ నిరుద్యోగం 9.6శాతానికి పెరగగా, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం 7.8శాతంగా వుంది.

ధరల పెరుగుదల

ద్రవ్యోల్బణం కొనసాగుతునే వుంది. ఆహార ద్రవ్యోల్బణం కొనసాగుతూ ప్రజల జీవనోపాధులపై మరిన్ని ఇబ్బందులను విధిస్తోంది. ఈ నేపథ్యంలో ఉపాధులు సృష్టించే మౌలిక వసతుల రంగాల్లో పెద్ద మొత్తంలో ప్రభుత్వ పెట్టుబడులు పెట్టాలని పొలిట్‌బ్యూరో డిమాండ్ చేసింది. లేనిపక్షంలో ఉపాధి కల్పన వుండదని, ప్రజల కొనుగోలు శక్తి సామర్ధ్యాలు కూడా పెరగబోవని పేర్కొంది.

పెరిగిన ఆర్థిక మాంద్యం

భారత ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పరిస్థితులు పెరుగుతుండడం పట్ల పొలిట్‌బ్యూరో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోందంటూ ఒకవైపు ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేస్తూ, ప్రకటనలు గుప్పిస్తున్నా భారతదేశ ఉత్పాదక సామర్ధ్యాలు పెంపొందేలా పెట్టుబడులు పెరగడం లేదు. అక్టోబరు మాసంలో పారిశ్రామిక ఉత్పత్తి నాలుగు శాతం క్షీణించింది. గత మూడు మాసాల్లో ఇలా జరగడం ఇది రెండోసారి. ప్రతి సంవత్సరం డేటాను పరిశీలించినట్లైతే తయారీ రంగ ఉత్పత్తి గణనీయంగా 5.4 శాతం క్షీణించింది. అక్టోబరులో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) 129.6గా వుంది. 2021 సెప్టెంబరు నుండి చూసినట్లైతే ఇది అత్యంత తక్కువగా వుంది. వినిమయ వస్తూత్పత్తి 15.3 శాతం మేర క్షీణించగా, వినిమయేతర వస్తూత్పత్తి 13.4 శాతం క్షీణించింది. ప్రజల కొనుగోలు శక్తి సామర్ధ్యాలు నిరంతరంగా తగ్గుతున్నాయనడానికి ఇదొక సూచనగా వుంది.

న్యాయ వ్యవస్థ

జ్యుడీషియల్ నియామకాల్లో, బదిలీల్లో ప్రభుత్వానికి ప్రముఖమైన పాత్ర వుండేలా చూసేందుకు మోడీ ప్రభుత్వం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఈ పరిస్థితులు న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం మధ్య, కొలీజియం వ్యవస్థ, జాతీయ జ్యుడీషియల్ అప్పాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి) మధ్య ఘర్షణకు దారి తీశాయి. ఇటీవల సుప్రీం కోర్టు ఎన్‌జెఎసి చెల్లదని రూలింగ్ ఇచ్చింది.

జ్యుడీషియల్ నియామకాలపై ప్రభుత్వ నియంత్రణ కోసం మోడీ ప్రభుత్వం చేసే యత్నాలన్నింటినీ సిపిఎం తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. వ్యతిరేకిస్తోంది. రాజీపడని రీతిలో న్యాయ వ్యవస్థ స్వేచ్ఛా స్వాతంత్ర్యం పరిరక్షించబడాలని పేర్కొంది.

బీమా కొరెగావ్ నిర్బంధితులను విడుదల చేయాలి

పూనే నగరానికి 30కిలోమీటర్ల దూరంలో నిర్వహించిన ఎల్గార్ పరిషద్ కార్యక్రమానికి 2018 జనవరి 1న బీమా కొరెగావ్‌లో తలెత్తిన హింసాకాండకు ఎలాంటి సంబంధం లేదని ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీనియర్ పోలీసు అధికారి ప్రమాణపూర్తిగా అంగీకరించారు. ఈ నేపథ్యంలో, ఈ కేసులో అరెస్టయిన యుఎపిఎ నిర్బంధితులందరినీ బేషరతుగా తక్షణమే విడుదల చేయాలని పొలిట్‌బ్యూరో కోరింది.

సహకార బిల్లు : సమాఖ్యవాదంపై దాడి

బహుళ రాష్ట్రాల సహకార సంఘాల సవరణ బిల్లు, 2022ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది, సమాఖ్యవాదంపై, రాష్ట్రాల హక్కులపై దాడి చేయడమేనని విమర్శించింది. సహకార సంఘాలనేవి రాష్ట్రానికి సంబంధించిన అంశం. ఈ ప్రతిపాదిత బిల్లు అనేది రాష్ట్రాల చట్టాలకు అనుగుణంగా నడిచే సహకార సంఘాలపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను రుద్దడానికి చేసే దారుణమైన ప్రయత్నం. సహకార సొసైటీలను నియంత్రించడానికి చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ఇది, ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను దెబ్బ తీయడమే, సమాఖ్యవాదంపై దాడి చేయడమే.

త్రిపుర పరిణామాలపై..

త్రిపురలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో సిపిఎం, ఇతర ప్రతిపక్షాలపై పాలక బిజెపి హింసాత్మక దాడులను ముమ్మరం చేసింది. బిజెపి ప్రభుత్వ నిరంకుశ పాలనతో ధ్వంసమవుతున్న చట్టబద్ధ పాలనను, ప్రజాస్వామ్యాన్ని తిరిగి పునరుద్ధరించాలని సిపిఎం, వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీలు సంయుక్తంగా డిమాండ్ చేశాయి.

అసెంబ్లీ ఎన్నికలు కేవలం ఒక ప్రహసనంగా నిర్వహించకుండా ఎన్నికల కమిషన్ క్రియాశీలంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలి. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించాలంటే, త్రిపురలో పూర్తి స్థాయిలో ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య హక్కులు పునరుద్ధరణ జరగాలి.

సిసి సమావేశం : జనవరి 28-30 తేదీల్లో కోల్‌కతాలో సిపిఎం కేంద్ర కమిటీ సమావేశం కానుంది.

తీవ్రమవుతున్న మతోన్మాద ధోరణులు

ముస్లిం మైనారిటీలపై హింసాత్మక నేరపూరిత దాడులు చేయాలంటూ పాలక పార్టీ ఎంపి ఇచ్చిన పిలుపు తీవ్రంగా ఖండించదగ్గదని పొలిట్‌బ్యూరో పేర్కొంది. అధికారులు ఈ విషయాన్ని తమకు తాముగా పరిగణనలోకి తీసుకుని, క్రిమినల్ కేసు నమోదు చేయడానికి బదులుగా ఎంపి ప్రసంగాన్ని వ్యతిరేకిస్తూ ఫిర్యాదు వస్తేనే తాము చర్యలు తీసుకోగలమని చెప్పడం వింతగా వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఇటువంటి విషపూరితమైన విద్వేషం, హింస, భయోత్పాతాలను ప్రచారం చేసే వారికి ఇది, బహిరంగంగా ఆశ్రయం, రక్షణ కల్పించడమేనని విమర్శించింది. విద్యా సంస్థల్లో ముస్లిం విద్యార్ధులకు వ్యతిరేకంగా విద్వేషం ప్రమాదకరమైన రీతుల్లో పెరుగుతోంది, క్రైస్తవ మైనారిటీలపై కూడా దాడులు పెరుగుతున్నాయి. మౌలానా అజాద్ జాతీయ ఫెలోషిప్ (ఎంఎఎన్ఎఫ్) పేరుతో ముస్లిం విద్యార్ధులకు స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు ఇచ్చే పథకం రద్దు చేయబడింది. ఇతర వివిధ రకాలైన స్కాలర్‌షిప్ పథకాలతో ఎంఎఎన్ఎఫ్ కలిసిపోతుండడం వల్లనే ఈ నిర్ణయం తీసుకున్నామంటూ ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలియచేసింది. ఇది దారుణమైన అవాస్తవం. వివిధ రాష్ట్రాల్లో ముస్లింలను, ఇతర మతపరమైన మైనారిటీలను ఒబిసిలుగా పరిగణించడం లేదు. అందువల్ల ఈ స్కాలర్‌షిప్‌ను తప్పనిసరిగా పునరుద్ధరించాలి.

అనిల్ దేశ్‌ముఖ్ విడుదల

ముంబయి : మహారాష్ట్ర మాజీ హోంశాఖ మంత్రి, ఎన్‌సిపి నేత అనిల్ దేశ్‌ముఖ్ (73) ముంబయిలోని అర్థర్ రోడ్‌లో ఉన్న జైలు నుంచి బుధవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బెయిల్‌పై విడుదలయ్యారు. కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) దర్యాప్తు చేస్తున్న ఒక అవినీతి కేసులో నిందితుడిగా ఆయనకు ఇదివరకే జారీ చేసిన బెయిల్‌పై స్టే విధించేందుకు బొంబయి హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. 2021 నవంబరులో ఒక మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసినప్పటి నుంచి దేశ్‌ముఖ్ జైలులో ఉంటున్నారు. ఎన్‌సిపి నేత అజిత్ పవార్ జైలు వద్దకు వెళ్లి అనిల్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేశ్‌ముఖ్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై తనకు సంపూర్ణ విశ్వాసముందని తెలిపారు.

జమ్మూ కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

- నలుగురు ఉగ్రవాదుల మృతి

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్ లో బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగింది. జమ్మూలోని సిద్రా ప్రాంతంలో ఉగ్రవాదులుకు, భద్రతాబలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల సమయంలో ట్రక్కులో మంటలు చెలరేగాయని, మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది యత్నిస్తున్నారని అన్నారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓ ట్రక్కు కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు దాన్ని వెంబడించారు. చెక్‌పోస్ట్ వద్ద ట్రక్కుని ఆపగా డ్రైవర్ పరారయ్యాడు. ట్రక్కుని వెతికేందుకు యత్నిస్తుండగా అందులో దాగి ఉన్న ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భద్రతా దళాలు కూడా వెంటనే స్పందించాయని.. కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించారని జమ్ము అదనపు డైరెక్టర్ జనరల్ ముఖేష్ సింగ్ తెలిపారు. ఘటనాస్థలం నుండి 7 ఎకె-47 తుపాకులు, 3 పిస్టళ్లను స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

రాయలసీమ ఎత్తిపోతలకు అనుమతులివ్వండి

- కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రితో జగన్ భేటీ
- తెలంగాణ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఫిర్యాదు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాయలసీమ ఎత్తిపోతల నీటి పారుదల పథకానికి సంబంధించిన పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సిఎం జగన్మోహన్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం నాడిక్కడ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో ఆయన నివాసంలో సిఎం జగన్మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లకు సంబంధించి పలు అంశాలను కేంద్ర మంత్రికి సిఎం జగన్ వివరించారు. కృష్ణా నదిపై ఉన్న ఆయా ప్రాజెక్టులలో తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఫిర్యాదు చేశారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌ను, ఒప్పందాలను, ఆదేశాలను ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. ఈ రెండు ఏళ్లలో సీజన్ తొలి రోజు (జూన్ 1) నుంచే విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వినియోగించిందన్నారు. శ్రీశైలం జలాశయంలో కనీస నీటి స్థాయి 834 అడుగులు కంటే తక్కువగా ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తికి నీటి విడుదల చేయడంతో పాటు, కెఆర్ఎంబి ముందు కనీసం ఎలాంటి ఇండెంట్ కూడా లేకుండానే ఏకపక్షంగా నాగార్జున సాగర్, కృష్ణా డెల్టాకు అవసరం లేనప్పటికీ నీటి విడుదల చేసిందని తెలిపారు.

ఆ ప్రాజెక్టులకు అనుమతుల్లేవ్..

విద్యుత్ ఉత్పత్తి కోసం తెలంగాణ ప్రతీ ఏటా 796 అడుగుల వరకు నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల శ్రీశైలం రిజర్వాయరులో కనీస నీటి మట్టం నిర్వహణకు సహకరించడం లేదని అన్నారు. శ్రీశైలంలో జలాశయంలో నీటిమట్టం 881 అడుగులకు చేరుకుంటే తప్ప, పోతిరెడ్డిపాడు నుంచి పూర్తిస్థాయిలో నీటి విడుదల సాధ్యం కాదని వివరించారు. పోతిరెడ్డి పాడు నుంచి కరువు పీడిత రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలతో పాటు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు, చెన్నైకి తాగు నీరు అందించడం సాధ్యం కాదన్నారు. ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (3 టిఎంసిలు), దిండి పథకాలను 800 అడుగులు వద్ద నిర్మిస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల రిజర్వాయరు నీటి మట్టం 854 అడుగుల కంటే పైన నిర్వహించడం సాధ్యం కాదని, మరోవైపు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి కేటాయించిన నీటిని వాడుకోవడానికి కూడా సాధ్యపడదని వివరించారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం(ఆర్ఎల్ఎస్)ను అమలు చేయడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని అన్నారు. దీని ద్వారా రోజుకు 3 టింఎసిల నీటిని టిజిపి, ఎస్ఆర్‌బిసి, జిఎన్ఎస్ఎస్‌లకు సరఫరా చేయగలుగుతామని అన్నారు.

రెండు పోర్టులకు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు అనుమతివ్వండి

కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్ట్‌లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులలో ఎర్రవరం, కురికుట్టి, సోమశిల, అవుకు వంటి చోట్ల ఏర్పాటు జరుగుతోందని, ఆ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కోరారు. కడప జిల్లా గండికోట వద్ద 1,000 మెగావాట్స్ పంప్డ స్టోరేజీ ప్రాజెక్టు, లోయర్ సీలేరు హైడ్రో పవర్ ప్రాజెక్టు (230 మెగావాట్లు), అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు(1,350 మెగావాట్లు) సామర్థ్యంతో చేపడుతోందని, వీటికి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

అమెరికాను వీడని మంచు కష్టాలు !

- కూరుకుపోయిన బఫెలో ప్రాంతం

బఫెలో, న్యూయార్క్ : అమెరికాలో మంచు తుపాను తీవ్రత ఏ మాత్రమూ తగ్గలేదు. రోజుల తరబడి కుటుంబాలు మంచులో చిక్కుకుపోవడంతో ప్రజల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా వున్నాయి. ఇప్పటికే మంచు తీవ్రతకు మరణించిన వారి సంఖ్య 50దాటింది. న్యూయార్క్ రాష్ట్రంలో పరిస్థితి మరీ దారుణంగా వుందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని లేక్‌సైడ్ కౌంటీలోనే అతిపెద్ద నగరమైన బఫెలో మేయర్ బిరాన్ బ్రౌన్ ట్వీట్ చేశారు. బఫెలో ఏరియా మరింత మంచులో కూరుకుపోయిందని అన్నారు. దాదాపు 50 అంగుళాల మందాన మంచు పేరుకుపోయింది. గత ఐదు రోజుల నుండి ఇక్కడ జన జీవనం స్తంభించిపోయింది. ఇక్కడ పరిస్థితి యుద్ధరంగంలో మాదిరిగా వుందని న్యూయార్క్ రాష్ట్ర గవర్నర్, బఫెలో వాసి కేథీ హోచుల్ వ్యాఖ్యానించారు. ఈ శతాబ్దంలోనే ఇది అతిపెద్ద మంచు తుపానుగా ఆయన పేర్కొన్నారు. ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో హైవేలపై చిక్కుకుపోయిన వారిని కాపాడడం కూడా కష్టంగా మారింది. మంచుతుపాను ధాటికి సహాయక సిబ్బంది మంచును పెకిలించే కార్యకలాపాలు కూడా చేపట్టలేకపోతున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా వుంది. అంబులెన్సులు కూడా వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. కార్యాలయానికి వెళ్ళి తిరిగి ఇంటికి వస్తూ కారులో మంచులో 18గంటలకు పైగా చిక్కుకుపోయి 22ఏళ్ళ యువతి ఆండెల్ టేలర్ మరణించింది. ఆమె పంపిన వీడియోను ఆమె సోదరి పోస్టు చేశారు.

పాక్షికంగా గడ్డ కట్టిన నయాగారా !

మంచు తుపాను కారణంగా నయాగారా జలపాతం పాక్షికంగా గడ్డ కట్టింది. ఇందుకు సంబంధించి వీడియోలు, పోస్టులు బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అయితే సెకనుకు 3160 టన్నుల మొత్తంలో నీరు ప్రవహిస్తున్న కారణంగా, సెకనుకు 32 అడుగుల వేగంతో నీరు కిందపడుతూ వుంటున్నందున మొత్తంగా జలపాతం గడ్డ కట్టే అవకాశం లేదు.

ఆ దేశాలకు చమురు విక్రయించం

- డిక్రీ జారీచేసిన రష్యా

మాస్కో : ఉక్రెయిన్‌పై చేపట్టిన సైనిక చర్య నేపథ్యంలో పశ్చిమ దేశాలు అంగీకరించిన ధరల పరిమితికి అనుగుణంగా వ్యవహరించే దేశాలు, కంపెనీలకు చమురు విక్రయాలను నిషేధించాలని రష్యా నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఒక డిక్రీ జారీ చేసింది. ఫిబ్రవరి 1 నుండి అమల్లోకి వచ్చే ఈ డిక్రీ జులై 1 వరకు అమల్లో వుంటుంది. రష్యా నుండి చమురు సరఫరాల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్న విదేశీ సంస్థలు, వ్యక్తులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ధరల పరిమితిని ఉపయోగించినట్లైతే వారికి రష్యా చమురు, చమురు ఉత్పత్తుల సరఫరా నిలిచిపోతుందని ఆ డిక్రీ పేర్కొంది. అయితే రష్యా అధ్యక్షుడు పుతిన్ తీసుకునే ప్రత్యేక నిర్ణయం ప్రాతిపదికగా వ్యక్తిగత కేసుల్లో ఈ నిషేధాన్ని ఎత్తివేయడానికి అవకాశం వుంటుందని డిక్రీ పేర్కొంది.

కర్నాటకలో చర్చిపై దాడి

- దెబ్బతిన్న జీసస్ విగ్రహం



న్యూఢిల్లీ : కర్నాటకలో హిందూత్వ శక్తులు పెట్రేగిపోయారు. మైసూరుకు 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెరియపట్నా వద్ద ఉన్న చర్చిపై మంగళవారం కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు దాడికి తెగబడ్డారు. చర్చిలోపల ముందు భాగాన ఉండే వేదికను దుండగులు ధ్వంసం చేశారు. కుర్చీలు, బల్లల్ని విరగొట్టారు. ఈ దాడిలో జీసస్ విగ్రహం దెబ్బతిన్నది. విలువైన పరికరాల్ని ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై పెరియాపట్నం పోలీసులు కేసు నమోదుచేశారు. ఉద్దేశపూర్వకంగా దాడికి తెగబడటమేగాక, మత విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యకు పాల్పడ్డారని ఆరోపణలు, దొంగతనం కేసు నమోదయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, దాడి ఘటన మంగళవారం రాత్రి 7గంటలకు జరిగింది. చర్చి ప్రధాన పూజారి దగ్గర్లోని పట్టణానికి వెళ్లిన సమయంలో దాడి చోటుచేసుకుంది. క్రిస్మస్ పండుగకు రెండు రోజుల తర్వాత దాడికి ఈ చర్చిని దుండగులు ఎంపిక చేసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లా అడిషనల్ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ బి.ఎస్.నందిని ఘటనా స్థలాన్ని సందర్శించారు. దాడి ఘటనపై అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని, కొంతమందిపై అనుమానాలున్నాయని సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 220 మంది పాలస్తీనియన్లు మృతి

గాజా : వందలాది మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ దళాలు హతమార్చడాన్ని పాలస్తీనా ప్రధానమంత్రి మొహమ్మద్ ష్టయ్యే ఖండించారు. ఆయన మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశలో మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దళాలు చేసిన దాడుల వల్ల 9 వేల మందికిపైగా గాయపడ్డారని, 220 మంది చనిపోయారని ఆయన అన్నారు. అలాగే 6,500 మంది పాలస్తీనీయన్లను ఇజ్రాయెల్ దళాలు ఖైదీల్లా బంధించాయని ఆయన మాట్లాడారు. ఈ దాడుల్లో పాలస్తీనీయుల హత్యలకు తోడు 832 భవనాలు, 13 వేల ఆలివ్ ఆయిల్ నేలమట్టవ్వడంతోపాటు చాలా ఇళ్ల ధ్వంసమయ్యాయన్నారు. కాగా, బెంజిమన్ నెతన్యాహు నేతృత్వంలోని రాబోయే ఇజ్రాయెల్ ప్రభుత్వం బెదిరింపులకు తాము భయపడబోమని, నేరపూరిత ఇజ్రాయెల్ దురాక్రమణను పాలస్తీనియన్లు ధైర్యంగా ఎదుర్కొంటారని ఆయన అన్నారు. మాతృభూమిపై ఉన్న హక్కును పాలస్తీనియన్లు కాపాడుకుంటారని, వారికి ప్రపంచ మద్దతు ఉందని ఆయన చెప్పారు.

ఎవరు వారు ..?

మట్టితోని సావాసం చేసేటివారు
నాగలితో దుక్కిదున్ని నాట్లేసేవారు!
ఆకలితోని తాము పస్తులుంటూనే
జనులందరి ఆకలినీ తీర్చేటివారు!

వానలకూ వరదలకూ లొంగరూ వారు
కరువు కాటకాలను ఎదిరించువారు!
పుట్టెడు కష్టాలనూ దిగమింగుతూనే
గరిసెలతో ధాన్యము పండించేవారు!



పశువులను ప్రేమతో పెంచేటివారు
పాడితో ఇల్లంతా నింపేటి వారు!
పనిపాటలతో తాము సేదతీరుతూనే
పదిమందికీ మంచిని పెంచేటివారు!

ఎవరయ్యా? ఎవరు? ఎవరు వారు?
మేలును చేకూర్చే రైతులే వారు!
లోకకల్యాణము కోరేటివారు!
దేశసంపద పెంచే అన్నదాతలు వారు!

- రావిపల్లి వాసుదేవరావు
94417 13136




ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



- మహాదేవోజు సుస్మిత,
7వ తరగతి,
జక్కాపూర్,
సిద్దిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



ఆడంబరాలు హెచ్చు.. హద్దు దాటుతున్న ఖర్చు ...

పెళ్లిళ్లకు కావలసింది రెండు మనసుల కలయిక. రెండు కుటుంబాల మధ్య కొత్త అనుబంధాలు. దీనికోసం పదిమందీ హాజరై ఆశీర్వదించటం, అభినందించటం. ఇలాంటి ఆశయాలతో ఆరంభమైన పెళ్లి వేడుక. ఆడంబరాలకూ, బలప్రదర్శనలకూ, వృధా ఖర్చులకూ వేదిక అయింది. ధనిక కుటుంబాల్లో జరిగే ఈ వేడుకలు ట్రెంట్‌గా మారాయి. ఆ ప్రభావం మధ్యతరగతిపై పడుతోంది. ఆడపిల్ల మెచ్యూర్ విషయాన్ని కూడా పండగలా జరుపుకునే సంస్కృతిని తీసుకువచ్చింది. కరోనా లాక్‌డౌన్‌లో నిబంధనల వల్ల తక్కువమంది బంధుమిత్రులతో సింపుల్‌గా పెళ్లి జరుపుకున్న వారూ ఉన్నారు. కానీ ఈ ఏడాది మాత్రం చాలా కుటుంబాలు ఆ పరిస్థితులను దాటి లక్షల కోట్లు ఖర్చు పెట్టినట్టు నివేదికలు వెల్లడించాయి.

ట్రెండ్ 2022

గతంలో ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే బంధువుల అబ్బాయినో, ఊరిలో తెలిసిన వాళ్లకో, పక్క ఊరిలో చూసి చేసేవారు. కాని జనరేషన్ మారుతోంది. పట్టణాలు, నగరాలకు, విదేశాలకు వెళ్లి యువత చదువుకుంటుంది. ఈ క్రమంలో తమకు నచ్చిన అమ్మాయి, అబ్బాయి తారసపడితే ప్రాంతంతోనూ, భాషతోనూ సంబంధం లేకుండా వివాహబంధాలు పెనవేసుకుంటున్నాయి. దాంతో కొందరు బంధుత్వం కలుపుకుంటున్న కుటుంబాలకు చెందిన పద్ధతులు, సాంప్రదాయం ప్రకారం ఇక్కడ వారూ హంగు, ఆర్భాటాలతో పెళ్లి వేడుకలు జరుపుతున్నారు. మూడు, ఐదు, ఏడు రోజులూ గానా బాజాలతో హంగామా చేస్తున్నారు. దాంతో ఖర్చు విపరీతంగా పెరిగిపోతుంది.

శుభకార్యం అనగానే బంధుమిత్రులు, ఆత్మీయులు రావాలని కోరుకోవడంలో తప్పులేదు. డబ్బు ఉన్నవారు పిల్లల సంతోషం కోసం ఘనంగా పెళ్లి చేస్తున్నారు. కానీ అనవసరమైన వృధా ఖర్చు ఎక్కువవుతున్నట్లు నివేదికలు వెల్లడించాయి. తినే కొద్దిపాటి భోజనం కోసం రకరకాల స్వీట్స్, కేకులు, నాలుగు ఐదు వెజ్, నాన్ వెజ్ ఫుడ్ ఐటమ్స్ పెడతారు. అన్ని రకాల టిఫెన్లూ, చివరిలో పండ్లు, రసాలు, డ్రింక్‌లూ ఉంచుతున్నారు. ఇందులో చాలావి పూర్తిగానో, సగం సగం గానో మిగిలిపోతున్నాయి. దాంతో మొత్తం పారబోస్తారు. కేవలం పెళ్లి వేడుకల్లోనే వేల కోట్ల టన్నుల ఆహారం వృధాగా పారేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇది దేశ ఆహారధాన్య నష్టం కిందకి వస్తుంది. కొన్ని కుటుంబాల్లో పెళ్లి రోజు మాత్రమే వేసుకునే ఆభరణాలు, పట్టు చీరలు, గౌన్లకే రూ.50 లక్షల వరకూ ఖర్చు పెడుతున్నట్లు అంచనా. ఈ పెళ్లి బట్టలు మళ్లీ వినియోగించరు. పెళ్లికి రెండు, మూడు రోజులు నుంచే ఇంట్లో వేడుకలు ప్రారంభమవుతాయి. మెహందీ ఫంక్షన్, సంగీత్, హల్దీ, కల్యాణం, వ్రతం, రిసెప్షన్ అని ఈవెంట్ ఆర్గనైజ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుపుతున్నారు. ఇక ప్రతి కార్యక్రమానికి ఒక డ్రెస్ కోడ్ ఉంటుంది. వాటితో బంధువులు, స్నేహితులు, సన్నిహితులు వేడుకలకు హాజరవుతున్నారు. వాటికి తగ్గట్లుగా నగలు, అలంకరణ ఉంటుంది. ఇవన్నీ ఉత్తర భారతదేశంలో కొన్ని సామాజిక వర్గాల ఆచార వ్యవహారాలు. కానీ ఇవి డబ్బు ఉన్న ప్రతి ఒక్కరూ జరుపుకునే వేడుకల్లా మారిపోయాయి. ఈ ట్రెండ్ ప్రభావం మధ్య తరగతి కుటుంబాలపైనా పడుతోంది. దీనికి తోడు పెళ్లికి వచ్చినవారి అందరికీ వారి పెళ్లి వేడుక గుర్తుండేలా రిటర్న్ గిఫ్టుల పేరిట భారీ బహుమతులు అందిస్తున్నారు. ఇవి కాకుండా ఫంక్షన్ హాల్లో డిజె, లైట్ సెట్టింగ్, పూల అలకంకరణ, కళ్లు జిగేల్ అనేలా భారీ లైట్లు, ఫర్నేచర్‌తో పెళ్లి వేడుక, ఫొటోలూ, వీడియోలు, భోజనాలూ ఉంటాయి. గతంలో వివాహాలకు ఊరిలో అందుబాటులో ఉండేవారి చేతే సన్నాయి బృందాలు, సాధారణ బ్యాండ్ ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు కేరళ బ్యాండు, పంజాబీ బ్యాండు కనిపిస్తున్నాయి. దాంతో దీంతో, స్థానికంగా ఉండే సాంప్రదాయ కళాకారులు ఉపాధి కోల్పోతున్నారు.

కల్యాణాలకు లక్షల కోట్ల ఖర్చు

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) నివేదిక ప్రకారం ఈ ఏడాది నవంబర్ 14 నుంచి డిసెంబర్ 14 వరకూ దేశంలో 32 లక్షల పెళ్లిళ్లు జరిగాయి. ఈ పెళ్లిళ్ల నిమిత్తం ఏకంగా 3.75 లక్షల కోట్లు ఖర్చు అయ్యిందని అంచనా. సీఏఐటీ లెక్కల ప్రకారం ఒక్కొక్క పెళ్లికి రూ. 3 లక్ష చొప్పున 5 లక్షల పెళ్లిళ్లు జరిగాయి. ఇక మరో పదిలక్షల పెళ్లిళ్లలో పెళ్లికి రూ.5 లక్షల ఖర్చు అయ్యింది. మరో పది లక్షల పెళ్లిళ్లలో ఒక్కో పెళ్లికి పది లక్షల రూపాయలు, ఇంకో 5 లక్షల పెళ్లిళ్లలో ఒక్కో పెళ్లికి రూ. 25 లక్షలు, 50 వేల పెళ్లిళ్లలో పెళ్లికి రూ.50 లక్షలు, చివరి 50 వేల పెళ్లిళ్లలో ఒక్కో పెళ్లికి 1 కోటి రూపాయల చొప్పున ఖర్చు అయ్యింది. 2023 జనవరి 14 నుంచి మళ్లీ పెళ్లిళ్లు ప్రారంభమౌతాయిరూ.. ఢిల్లీలో వచ్చే నెల రోజుల వ్యవధిలో 3.5 లక్షల కంటే ఎక్కువ పెళ్లిళ్లు జరగవచ్చని అంచనా. ఈ పెళ్లిళ్లకు 75 వేల కోట్లు ఖర్చు కావచ్చు. గత ఏడాది కరోనా సమయంలో దాదాపు 25 లక్షల పెళ్లిళ్లు జరిగాయి. కాని ఒక్కో పెళ్లికి 3 లక్షలు ఖర్చైందని నివేదిక వెల్లడించింది.

ఆడపిల్ల వారికి భారం

పెళ్లి వేడుక నిర్వహణకు అవుతున్న ఖర్చు 20 శాతం పెళ్లి కొడుకు కుటుంబంపై, 80 శాతం పెళ్లి కూతురు కుటుంబంపై ఉంటుందని అంచనా. దాంతో ఆడపిల్ల వారు అప్పు చేయడం, లేదా అప్పటి వరకూ కూడబెట్టిన సొమ్ము అంతా ఉపయోగించడం చేస్తున్నారు. పెళ్లి తర్వాత కూడా జరిగే వేడుకలకు వీరికి అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. సారె, లాంఛనాలు అంటూ లేనిపోని సంప్రదాయాలు జరుపుతున్నారు. ఈ మధ్య గోదావరి జిల్లాలో ఒకరు 400 కిలోల మిఠాయి తన కుమార్తె అత్తవారికి సారెగా పంపారు. ఇది సోషల్‌మీడియాలో ట్రెండ్ అయ్యింది. ఇటువంటివి సామాన్యులపైనా ప్రభావం చూపుతాయి.

నిరాడంబరంగా ...

'జీవితంలో ఒకేసారి చేసుకునే పెళ్లికి ఈ మాత్రం ఖర్చు పెట్టకపోతే ఎలా?' అనే వారికి ఐఎఎస్ శివాంగి జోషి పెళ్లే ఆదర్శం. ఆమె మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా కలెక్టర్. భారత సైన్యంలో మేజర్‌గా పనిచేస్తున్న అంకిత్ చతుర్వేదిని గత ఏడాది వివాహం చేసుకున్నారు. ఇద్దరూ ఉన్నత కుటుంబాలకు చెందిన వారే. అయినా అనవసరంగా డబ్బు ఖర్చు చేయకూడదనే నిరాడంబరంగా కోర్టులో రూ.500 చెల్లించి పెళ్లి చేసుకున్నారు.

ఓణీలు, పంచెల ఫంక్షన్లు


గత దశాబ్దం వరకూ ఆడపిల్ల పెద్ద మనిషి అయితే ఫంక్షన్లు జరపడం తగ్గించారు. మళ్లీ ఇప్పుడు పుంజుకుంటున్నాయి. ఓణీలు, పుష్పాలంకరణతో ఫంక్షన్ హాల్స్ గ్రాండ్‌గా జరుపుతున్నారు. మగపిల్లలు ఉన్నవారూ పంచెల ఫంక్షన్లు జరుపుతున్నారు. కొన్ని సామాజిక తరగతుల్లో ఒక వయస్సు వచ్చాక పంచెలు ఇచ్చే ఆచారం ఉంటుంది. కాని దీన్ని ఒక ట్రెండ్‌గా మార్చారు. భారీగా ఖర్చు పెట్టి వేడుకగా జరుపుకుంటున్నారు. ఈ ట్రెండ్ పేద, మధ్య తరగతి వారికి భారంగానూ మారుతుంది.

లేనిపోని గొప్పలకు పోయి అప్పుచేసి వేడుకలు జరిపే కన్నా పిల్లల ఉన్నత చదువుకు ఖర్చు చేయడం, ఆడపిల్లల భవిష్యత్తుకు, వైద్యానికి ఉపయోగించడం ఉత్తమం. కరోనా మనకో గుణపాఠం నేర్పింది. జనం ఎక్కువైతే వైరస్ వ్యాప్తి అవుతుందని తక్కువ మందితో పెళ్లి చేసుకోవాలని అధికారులు నిబంధన పెట్టారు. ఇది ఎందరో ఆడపిల్ల తల్లిదండ్రులకు వరమైంది. ఇరువురు కుటుంబసభ్యులు, కొద్దిపాటి సన్నిహితుల మధ్య తక్కువ ఖర్చుతో వేడుకలు చేసుకోవడం సమాజానికి సందేశంగా నిలుస్తుంది. అవసరానికి మించిన హడావిడి, ఆడంబరం ఏ విషయంలోనూ మంచిదికాదు. ఆ మేరకు కట్టడి చేయడం కొత్త కాలపు అవసరం.

మా చిరునామా

రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రంగవల్లి





వి. చిత్ర మేఘన,
మంగళగిరి.
21 చుక్కలు
11 వచ్చే వరకు
(మధ్య చుక్క)

రిజర్వేషన్ల చిచ్చు రాజేస్తున్న బిజెపి

- ఏకపక్ష నిర్ణయాలతో గందరగోళం
- కర్ణాటక అసెంబ్లీలోనూ ప్రతిపక్షాల అభ్యంతరం

బెంగళూరు : బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలు రిజర్వేషన్లపై ఏకపక్ష నిర్ణయాలతో కొత్త వివాదాలను రాజేస్తూ ప్రజల్లో ఆందోళనలు సృష్టిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో యుపి సరైన కసరత్తు చేయకుండా ఏకపక్షంగా ఒబిసి రిజర్వేషన్లు అమల్జేస్తామనడంతో అక్కడి అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్ యోగి సర్కార్‌కు మొట్టికాయలు వేసింది. అయితే హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తామంటూ యుపి సర్కార్ ప్రకటించింది. ఒబిసిలకు రిజర్వేషన్ల కల్పనతోనే మున్సిపల్ ఎన్నికలకు వెళ్తామని తెగేసి చెబుతోంది. బిజెపి ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలను అక్కడి ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ, బిఎస్‌పి తదితర పక్షాలు తీవ్రంగా ఖండించాయి.

ఇటు కర్ణాటకలోని ముఖ్యమంత్రి బొమ్మై నేతృత్వంలోని బిజెపి సర్కార్ తీరు కూడా అలానే ఉంది. అంతర్గత రిజర్వేషన్ల విషయంలో కర్నాటక ప్రభుత్వం నియమించిన ఎజె సదాశివ కమిషన్ నివేదిక తీవ్ర అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. బెలగావిలోని సువర్ణ విధానసౌధలో జరుగుతున్న శీతాకాల శాసనసభా సమావేశాల్లోనూ ఈ అంశంపై బుధవారం ప్రతిపక్షాల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగస్వామ్య పక్షాలతో సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా ముందుకెళ్తే తీవ్ర పరిణామాలు తప్పవని కాంగ్రెస్ ప్రకాశ్ రాథోడ్, పిటి పరమేశ్వర నాయక్ తెలిపారు. సదాశివ కమిషన్ నివేదికపై తగిన సంప్రదింపులు జరపకుండా ముందుకెళ్లే ఏ చర్యనైనా తాము అడ్డుకుంటామని ప్రకటించారు. అధికారిక నివేదిక విడుదల చేయకుండా, తగిన సంప్రదింపులు జరపకుండా ప్రజల్లో ఆందోళనలు రాజేసేందుకు అధికార బిజెపి లీకులు విడుదల చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల షెడ్యూల్డు తరగతులకు చెందిన ప్రజలు తీవ్ర ఆందోళనకు, గందరగోళానికి గురౌతున్నారని పేర్కొన్నారు. 2005లో ఏర్పాటు చేసిన ఈ కమిషన్‌కు సంబంధించి లీక్ అయిన నివేదిక ప్రకారం..అంతర్గత రిజర్వేషన్లలో క్రిమి లేయర్‌ను మినహాయించడమే కాకుండా, షెడ్యూల్డు తరగతుల జాబితా నుంచి 101 ఉప తరగతులను తొలగించాలని కమిషన్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. దళితుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రతిపాదనలు చేయకుండా, వారిని ఇంకా అణిచివేతకు గురిచేసేటువంటి ప్రతిపాదనలను ఏకపక్షంగా అమల్జేస్తే ప్రతిఘటన తప్పదని ప్రతిపక్షాలు హెచ్చరించాయి.

రాహుల్‌కు భద్రత కల్పించండి

అమిత్‌షాకు కాంగ్రెస్ లేఖ

న్యూఢిల్లీ : భారత్ జోడో యాత్రలో పలు భద్రతా ఉల్లంఘనలు జరిగాయని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి తగిన భద్రత కల్పించాలంటూ పార్టీ డిమాండ్ చేసింది. భారత్ జోడోయాత్ర గత శనివారం ఢిల్లీలోకి ప్రవేశించిన సంగతి తెలిసిందే. పలు సందర్భాల్లో యాత్ర భద్రతపై రాజీపడాల్సి వచ్చిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్ ఆ లేఖలో పేర్కొన్నారు. రాహుల్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్నప్పటికీ.. హోం మంత్రి పరిధిలోకి వచ్చే ఢిల్లీ పోలీసులు జనాలను నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, జోడోయాత్రలో పాల్గొన్న వారు రాహుల్‌కు రక్షణగా నిలిచారని, ఆ సమయంలో ఢిల్లీ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని అన్నారు. హర్యానా రాష్ట్ర ఇంటిలిజెన్స్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు భారత్ జోడో యాత్రలోకి అక్రమంగా ప్రవేశించారని.. దీనిపై హర్యానాలోని గుర్‌గావ్‌లో పార్టీ ఫిర్యాదు చేసిందని వేణుగోపాల్ తెలిపారు.

యాత్రలకు వేళాయె !

జనవరి 5 నుంచి బీహార్‌లో నితీష్ యాత్ర • అదే సమయంలో కాంగ్రెస్ కూడా

పాట్నా : సార్వత్రిక ఎన్నికలకు రోజులు దగ్గర పడేకొద్దీ దేశవ్యాప్తంగా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వేర్వేరుగా రాష్ట్రవ్యాప్తంగా జనవరి 5 నుంచి యాత్ర లు చేపట్టే అవకాశముంది. పశ్చిమ ఛంపరాన్ జిల్లా కేంద్రమైన బెట్టయ్య నుంచి నితీష్ కుమార్ తన రాష్ట్రవ్యాప్త యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. కల్తీ మద్యం కారణంగా 38 మంది పైగా మరణించిన నేపథ్యంలో నితీష్ యాత్రపై ప్రశ్నలు లేవనెత్తగా మద్య నిషేధ ప్రయోజనాలను ప్రజలకు వివరించేందుకు తాను యాత్ర చేసితీరుతానని నితీష్ తెలిపారు. రాహుల్ జోడో యాత్రతో స్ఫూర్తి పొందిన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ కూడా బీహార్‌లో యాత్రకు శ్రీకారం చుడుతున్నట్లు బీహార్ అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత అజిత్ శర్మ తెలిపారు. ఇది కూడా నితీష్ యాత్ర ప్రారంభించే జనవరి 5 నుంచే మొదలు కానుంది. పాట్నా సహా 17 జిల్లాల మీదుగా ఈ యాత్ర నిర్వహించాలని పిసిసి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.




శ్రీవారిని దర్శించుకున్న సిజెఐ

ప్రజాశక్తి - తిరుచానూరు

తిరుమల శ్రీవారిని, తిరుచానూరు పద్మావతి అమ్మవారిని భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం తిరుమలకు చేరుకున్న ఆయన బుధవారం తెల్లవారుజామున శ్రీవారిని, అనంతరం పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం ఎదుట సిజెఐకు టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ అనిల్ కుమార్ స్వాగతం పలికారు. తిరుపతి జిల్లా జడ్జి వీర్రాజు, టిటిడి సివిఎస్వో నరసింహ కిషోర్, డిప్యూటీ ఇఒ శాంతి , విజిఒ మనోహర్, అదనపు ఎస్‌పి కులశేఖర్, డిఎస్‌పి మురళీ కృష్ణ, ఆలయ ఎఇఒ ప్రభాకర్ రెడ్డి, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

ముగిసిన చలపతిరావు అంత్యక్రియలు



సినీ నటుడు చలపతిరావు భౌతికకాయానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో తన నివాసంలో శనివారం ఉదయం చలపతిరావు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. అమెరికాలో స్థిరపడిన కుమార్తెలు శ్రీదేవి, మాలిని హైదరాబాద్ చేరుకున్న అనంతరం బుధవారం ఆయన అంత్యక్రియలు పూర్తి చేశారు. జూబ్లీహిల్స్‌లో మహాప్రస్థానం విద్యుత్ దహన వాటిక వద్ద ఆయన కుమారుడు రవిబాబు, కుటుంబసభ్యుల సమక్షంలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. మంచు మనోజ్, దగ్గుబాటి సురేశ్‌బాబు, బండ్ల గణేశ్, బోయపాటి శ్రీను, శ్రీవాస్, బి. గోపాల్, రఘుబాబు, కాశీ విశ్వనాథ్ తదితరులు హాజరయ్యారు.

శిఖా పాండేకు పిలుపు

టి20 ప్రపంచకప్‌కు జట్టు ఎంపిక



ముంబయి: 2023లో దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న టి20 ప్రపంచకప్‌కు జట్టును బిసిసిఐ ఎంపిక చేసింది. ఏడాది తర్వాత శిఖా పాండేకు పిలుపు వచ్చింది. బిసిసిఐ బుధవారం ప్రకటించిన జట్టులో శిఖా పాండే చోటు చేసుకోగా.. కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన ఎంపికయ్యారు. స్టాండ్‌బైగా ముగ్గురు ప్లేయర్స్‌ను కూడా బిసిసిఐ ఎంపిక చేసింది. టి20 ప్రపంచకప్‌కు ముందు భారత మహిళల జట్టు ఓ ట్రయాంగులర్ సిరీస్‌లోనూ తలపడనుంది.

అంజలికి చోటు

కర్నూలుకు చెందిన తెలుగమ్మాయి కేశవరాజుగారి అంజలి శర్వాణి టి20 ప్రపంచకప్ జట్టులో తొలిసారి చోటు దక్కించుకొంది. 25ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్, పేసర్ అయిన అంజలి స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో రాణించడంతో ఆమెకు ఈ బెర్త్ దక్కింది.

దక్షిణాఫ్రికాపై 54పరుగుల తేడాతో గెలుపు

అండర్-19 మహిళల ప్రపంచకప్ ముందు దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో షెఫాలీ వర్మ సారథ్యంలోని భారతజట్టు దక్షిణాఫ్రికాపై 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత మహిళల జట్టు 20 ఓవర్లలో 137పరుగులు చేసింది. శ్వేత సావంత్(40) బ్యాటింగ్‌లో రాణించగా.. షెఫాలీ వర్మ డకౌటయ్యింది. ఛేదనలో దక్షిణాఫ్రికా జట్టు 83పరుగులకే ఆలౌటైంది. అర్చన దేవి, షబ్నమ్ మూడేసి వికెట్లు తీసి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. సఫారీ మహిళల జట్టు ఛేదనలో భాగంగా 17వ ఓవర్‌లో భారత స్పిన్నర్ మన్న త్ కశ్యప్ మన్కడింగ్ ద్వారా సఫారీ నాన్ స్ట్రయికర్ జెన్నా ఇవాన్స్‌ను ఔట్ చేయడం ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

టి20 ప్రపంచకప్‌కు జట్టు: హర్మన్(కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలీ, యస్టికా, రిచా(వికెట్ కీపర్లు), జెమామీ, హర్లిన్, దీప్తి, దేవిక వైద్య, రాధా, రేణుక, అంజలి, పూజా వస్త్రాకర్, రాజేశ్వరి, శిఖా. స్టాండ్‌బై: మేఘన, స్నేహ్ రాణా, మేఘ్నా సింగ్.

ట్రయాంగులర్ సిరీస్‌కు: హర్మన్(కెప్టెన్), స్మృతి (వైస్ కెప్టెన్), యస్టికా(వికెటట్ కీపర్), రోడ్రిగ్స్, హర్లిన్, దీప్తి, దేవిక, రాజేశ్వరి, రాధా యాదవ్, రేణుక, మేఘ్నా, అంజలి, శుష్మా వర్మ(వికెట్ కీపర్), అమన్‌జోత్, పూజా వస్త్రాకర్, సబ్బినేని మేఘన, స్నేహ్ రాణా, శిఖా పాండే.



ధోనీ కుమార్తెకు మెస్సీ జెర్సీ బహుమతి

రాంచీ: టీమిండియా జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కుమార్తె జీవాకు ఫిఫా ప్రపంచకప్ టైటిల్ విజేత అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చాడు. మెస్సీ సంతకం చేసిన అర్జెంటీనా జెర్సీని బహుమతిగా అందించారు. ఖతార్‌లోని లుసైల్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఫైనల్‌లో అర్జెంటీనా ఫ్రాన్స్‌ను ఓడించడంతో ఫిఫా ప్రపంచ కప్ టైటిల్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. విజయం అనంతరం మెస్సి.. జీవా ధోనీకి 'జీవా కోసం' అనే సందేశంతో సంతకం చేసిన షర్ట్‌ను పంపాడు. మెస్సీ పంపిన జెర్సీని ధరించిన జీవా సంబరాల్లో తేలిపోతోంది. ఆ షర్ట్‌ను ధరించి ఫొటోలకు ధోనీ సతీమణి సాక్షి ధోనీ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. 'లైక్ ఫాదర్, లైక్ డాటర్' అంటూ సరదాగా క్యాప్షన్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారింది.

కొత్త ఏడాది.. కొత్త సంకల్పం

కేంద్ర ప్రభుత్వ కేలండర్‌ను ఆవిష్కరించిన అనురాగ్ ఠాకుర్



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ అధీకృత నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం ఇక్కడ జరిగిన ప్రత్యేక కార్యాక్రమంలో కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ, క్రీడల మంత్రి అనురాగ్ ఠాకుర్ ఆవిష్కరించారు. 'కొత్త ఏడాది..కొత్త సంకల్పం' నేపథ్యంతో రూపొందించిన ఈ కేలండర్‌ను 11 లక్షల కాపీలు ముద్రించి దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. పంచాయతీ కార్యాలయాల్లో పంపిణీ చేసేందుకు 13 ప్రాంతీయ భాషల్లో మరో 2.5 లక్షల కాపీలు ప్రచురించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత భౌతిక రూపంలో కేలండర్ తీసుకురావడం ఇదే తొలిసారి అని డిజిటల్‌గా కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

ఆంధ్రకు స్వల్ప ఆధిక్యత

మహారాష్ట్ర రెండో ఇన్నింగ్స్ 89/1

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలోని చింతలవలస పి వి జి రాజు క్రికెట్ మైదానంలో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో రెండో రోజు ఆంధ్రజట్టుకు 11పరుగుల ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన మహారాష్ట్ర జట్టు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోయి 89 పరుగులు చేసింది. ఓవర్ నైట్ స్కోర్ తో 2 వికెట్ల నష్టానికి 58 పరుగులతో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 211 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కరణ్ షిండే(52), కెవి శశికాంత్(48) బ్యాటింగ్‌లో రాణించారు. మహారాష్ట్ర బౌలర్లలో ప్రదీప్, సత్యజిత్‌కు మూడేసి, త్రిపాఠి, పాల్కర్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన రెండోరోజు ఆట ముగిసే సమయానికి 27ఓవర్లలో వికెట్ నష్టానికి 89 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 51పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు.

హైదరాబాద్ 207ఆలౌట్

ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు అస్సాంపై 2పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతను సంపాదించింది. తొలి ఇన్నింగ్స్‌లో అస్సాం 205పరుగులు చేయగా.. హైదరాబాద్ జట్టు బుధవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించి 207పరుగులకు ఆలౌటైంది. రోహిత్ రాయుడు(59), లోయర్ ఆర్డర్ బ్యాటర్ భగత్ వర్మ(46) బ్యాటింగ్‌లో రాణించారు. అస్సాం బౌలర్లలో రియాన్ పరాగ్‌కు నాలుగు, ముక్తార్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అస్సాం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 6వికెట్లు కోల్పోయి 182పరుగులుచేసింది. రియాన్ పరాగ్(78) అర్ధసెంచరీకి తోడు, స్వరూపమ్(22) బ్యాటింగ్‌లో రాణించారు. రవితేజ, భగత్ వర్మకు రెండేసి, కార్తికేయ, త్యాగరాజన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68